## ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 30, పేజీలు - 08


ఆదివారం, జులై 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**- నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ తప్పుకొంటున్నట్లు ప్రకటన**



- గత కొన్నిరోజుల పరిణామాలు బాధించాయని వ్యాఖ్య
- వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం లేదని వెల్లడి
- యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్లు లేఖలో పేర్కొన్న వైనం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్, పరీక్షల అక్రమాలపై కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి సమర్పించిన ఆయన దేశ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు వెలుగులోకి రాగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని, పరీక్షను రద్దు చేసి రీ-ఎగ్జామ్ నిర్వహించిందని గుర్తు చేశారు. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని ప్రధాన్ చెప్పారు. పరీక్షా మాఫియా వల్ల ఒక్క ప్రతిభావంతుడికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో మొదటి రోజు నుంచే తాను బాధ్యత తీసుకున్నానని తెలిపారు. అయితే రీ-ఎగ్జామ్ ఫలితాల సమయంలో కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను

2లో..

# కేంద్రంతో చర్చలు సఫలం..

## దీక్ష విరమించిన సీజేపీ

**- యువతకు అభిజీత్ దీప్కే కీలక సూచనలు - యువతలో చాలా మార్పు వచ్చిందన్న దీప్కే**

**- సమస్యల ఆధారంగా రాజకీయాలు చేయాలని హితవు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మతపరమైన విభజన రాజకీయాలకు దూరంగా ఉండాలని కాక్రచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే యువతకు పిలుపునిచ్చారు. హిందూ- ముస్లింల పేరుతో జరిగే విద్వేష రాజకీయాల కంటే దేశ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నాయకులు కొన్ని రోజులపాటు మత రాజకీయాలకు అతీతంగా కేవలం ప్రజా సమస్యలపైనే దృష్టి సారిస్తే సరికొత్త చరిత్ర సృష్టించవచ్చని, అప్పుడే దేశానికి నిజమైన మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలోని యువత ఇకపై హిందూ-ముస్లిం రాజకీయాల ఉచ్చులో పడబోరని, తమ విద్య, ఉపాధి, ఉజ్వల భవిష్యత్తుపైనే ప్రధానంగా దృష్టి సారిస్తారని అభిజీత్ దీప్కే అన్నారు. మతం కంటే విద్య, సమగ్ర అభివృద్ధికే యువత అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి ఆలోచనల్లో స్పష్టమైన మార్పు వచ్చిందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా అధికార అహంకారంతో ఉంటూ, సామాన్య ప్రజల గొంతులను పట్టించుకోని నాయకులకు వ్యతిరేకంగా యువత తమ నిరసన గళాన్ని వినిపించాలని ఆయన కోరారు. యువత ఇప్పుడు కేవలం మెరుగైన భవిష్యత్తును, ఉద్యోగ అవకాశాలనే కోరుకుంటున్నారని, కనుక విద్వేష రాజకీయాలు ఇకపై చెల్లవని హెచ్చరించారు. నేటి తరం అత్యంత

2లో..

## విద్యార్థుల గొంతుక ప్రభుత్వ గర్వాన్ని దించింది

**- మోదీ ప్రభుత్వ అహంకారం ఓడిందన్న ఖర్గే**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థుల నుంచి వెల్లువెత్తిన తీవ్ర నిరసనలు, విపక్షాల ఒత్తిడి నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సహా పలువురు ప్రముఖులు

2లో..

# తెలంగాణలో డిలిమిటేషన్ ధమాకా

**- గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా మారబోతున్న రాష్ట్ర రాజకీయం?**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమల్లోకి వస్తే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాల సంఖ్య ఏకంగా 179 వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగ నిబంధనలు, జనాభా లెక్కల ప్రాతిపదికన ప్రతి నియోజకవర్గానికి సగటున 1.95 లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకుంటే.. ఈ ప్రక్రియలో అత్యధికంగా లబ్ధి పొందేది, సీట్లను అదనంగా సాధించుకునేది గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలే కానున్నాయి.

### విపరీతంగా జనాభా పెరిగిన గ్రేటర్ పరిధి

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలు విపరీతంగా విస్తరించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి నగరానికి వలసలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఆరు నుంచి ఏడు లక్షలు దాటిపోయింది. మిగతా జిల్లాల్లోని ఒక సాధారణ నియోజకవర్గంలో 2 నుంచి 2.5 లక్షల ఓటర్లు ఉంటే, హైదరాబాద్ అర్బన్ కారిడార్‌లోని ఒక్కో స్థానంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండాల్సినంత జనాభా కేంద్రీకృతమైంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడమే డిలిమిటేషన్ ప్రధాన లక్ష్యం కానుంది.




2లో..

# పొగాకు రైతులకు శాశ్వత భరోసా కల్పించాలి

**- రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం - కేంద్రంతో సీఎం చంద్రబాబు కీలక చర్చలు**

**- సమస్య పరిష్కారానికి మూడు ప్రతిపాదనలు - ట్రేడర్ల సహకారం కూడా అవసరమని సూచన**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభానికి తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూనే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు, బయ్యర్లు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పొగాకు రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ రాష్ట్రానికి వచ్చి ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే

2లో..

# 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ అర్హత

**- చట్టసభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గించాలి**

**- కేంద్రానికి తీర్మానం పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి**

**- నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీఎం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** చట్టసభలకు పోటీ వయసును తగ్గించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. కొన్నిదేశాలలో ఇప్పటికే ఈ విధానం అమల్లో ఉందన్న రేవంత్ రెడ్డి మనదేశంలోనూ ఇలాంటి విధానం రావాలని ఆకాంక్షించారు. ఈ అంశం మీద అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం

2లో..



## రియల్ ఎస్టేట్ కుదేలైందనే ప్రచారంలో నిజం లేదు

**- హైదరాబాద్ పెట్టుబడులకు గమ్యస్థానమన్న మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ ఢ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని ,

2లో..

# మీ ఆరోగ్యం.. మీ బాధ్యత

**- ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు**



- ప్రజారోగ్యానికి డిజిటల్ కవచం సంజీవని
- ఆస్పరిలో సీఎం చంద్రబాబు ప్రారంభ ప్రకటన
- 'సంజీవని'ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

**కర్నూలు (ప్రశ్న న్యూస్)** ప్రజల ఆరోగ్య పరిరక్షణను ప్రభుత్వ అత్యున్నత బాధ్యతగా భావిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెల నుంచి ప్రతిష్టాత్మక 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ఈ ప్రకటన చేశారు.

2లో..

# పదవులు తాత్కాలికం.. ప్రజా విశ్వాసమే ప్రధానం

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రశంసించిన కేంద్రమంత్రి**

**- ఇది బీజేపీ 'దేశమే ముందు' అనే సిద్ధాంతానికి నిదర్శనమన్న బండి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల నడుమ ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దేశానికే తమ మొదటి ప్రాధాన్యమని ఆ తర్వాతే పార్టీ ప్రయోజనాలని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి ఉద్యమం నుంచి కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించడం వరకు ఎదిగారని దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో గడిపారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ప్రజాస్వామ్యం అంటే ప్రజల మాట వినడం, వారి గొంతుకను గౌరవించడం అవసరమైనప్పుడు బాధ్యత స్వీకరించే ధైర్యం కలిగి ఉండటమని బండి సంజయ్ స్పష్టం చేశారు. పదవులు తాత్కాలికమని

2లో..

# ప్రధాన్ స్థానంలో ప్రహ్లాద్ జోషి

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆమోదం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళనల కారణంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ప్రహ్లాద్ జోషిని నియమించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రస్తుతం ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నప్రహ్లాద్ జోషికి విద్యా శాఖ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

2లో..

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. గత పది రోజులుగా జరిగిన పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని, ఇది వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, దేశ వ్యతిరేక శక్తులు ఈ అంశాన్ని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా కాపాడేందుకు, వారు చదువుపై దృష్టి పెట్టేలా చేయడానికే తాను రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, ప్రజాసేవను ఇకముందు కూడా కొనసాగిస్తానని పేర్కొన్నారు. కొందరు నిరుద్యోగులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలతో పుట్టిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో అవకతవకలపై 2026 జూన్ నుంచి ఉద్యమం మొదలుపెట్టింది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహార దీక్షతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఢిల్లీలోని జంతర్‌మంత్ వేదికగా సాగిన ఈ పోరు అనతి కాలంలో అనూహ్య ఆదరణను సొంతం చేసుకుంది. జులై 20న పార్లమెంట్ ముట్టడి లక్ష్యంగా తలపెట్టిన 'చలో సంసద్' కార్యక్రమంతో ఉద్యమం మరో స్థాయికి చేరింది. పోలీసుల లాఠీఛార్జి, వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం వంటి పరిణామాలతో దేశవ్యాప్తంగా యువత, ప్రముఖులు తమ గొంతుకను వినిపించారు. దీంతో దిగొచ్చిన కేంద్రం విద్యార్థులతో చర్చలు ప్రారంభించింది. స్వయంగా ప్రధాని ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రకటనలు చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేపర్ లీక్ కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే సంబంధిత చట్టాలను సైతం కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులతో శుక్రవారం రెండు దఫాలు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. వాటిలో నీట్ పేపర్ లీక్ వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసన చేపట్టిన విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని హామీ వంటి వాటికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో వాంగ్‌చుక్ సైతం తన దీక్షను విరమించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం సంశయించింది. కానీ, విద్యార్థులు ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పడంతో మంత్రి రాజీనామా చేయక తప్పలేదు.

# కేంద్రంతో చర్చలు సఫలం..

అప్రమత్తంగా ఉంటూ, కేవలం సమస్యల ఆధారిత రాజకీయాలనే ప్రోత్సహిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### కేంద్రంతో చర్చలు సఫలం.. ఆందోళన విరమించిన సీజేపీ

కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు విజయవంతమవ్వడంతో తమ ఆందోళనలను విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అధికారికంగా ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించడం, అలాగే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు మరియు యువత మద్దతుతో సీజేపీ నాయకులు ఢిల్లీతో పాటు పలు ప్రధాన రాష్ట్రాల్లో తీవ్ర స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమించినట్లు ప్రకటించిన నేతలు, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులందరూ సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకోవాలని కోరారు.

# విద్యార్థుల గొంతుక ప్రభుత్వ గర్వాన్ని దించింది

స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "ఇది సత్యానికి లభించిన విజయం. ప్రధాని మోదీ మొండివైఖరికి దక్కిన ఓటమి. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలందరిదీ ఈ విజయం" అని ఖర్గే అభివర్ణించారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణలో డిలిమిటేషన్ ధమాకా

### అధికారంలోకి రావడానికి గ్రేటర్ బెల్ట్ సీట్లే కీలకం

అంచనాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల ఉమ్మడి అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 29 నుంచి ఏకంగా 45కిపైగా పెరిగే అవకాశముంది. పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, మేడ్చల్, కూకట్‌పల్లి, మహేశ్వరం వంటి అతిపెద్ద నియోజకవర్గాలను రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విభజిస్తారు. దీనివల్ల కేవలం గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల అర్బన్ పరిధిలోనే దాదాపు 16 నుంచి 20 కొత్త అసెంబ్లీ స్థానాలు పుట్టుకొస్తాయి. అంటే, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా గ్రామీణ ప్రాంతాల కంటే ఈ గ్రేటర్ బెల్ట్ సీట్లే అత్యంత కీలకం కానున్నాయి.

### రూరల్‌లోనే కాంగ్రెస్‌కు ఎక్కువ పట్టు

ఈ స్థానాల పెంపు ఏ పార్టీకి రాజకీయంగా అడ్వాంటేజ్ ఇస్తుందనేది ఇప్పుడు అసలు సిసలైన చర్చ. నగర ఓటర్లలో మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు, ఆంధ్రా మూలాలున్న సెటిలర్లు, ఉత్తరాది వలసదారులు ఎక్కువగా ఉంటారు.

చారిత్రాత్మకంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మైగ్రెంట్స్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో బిజెపి , బిఆర్ఎస్ పార్టీలకు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. డిలిమిటేషన్ వల్ల నగర సీట్లు పెరిగితే అర్బన్ క్లాస్, సెటిలర్ ఓటర్ల ప్రభావం మరింత పెరిగి బీజేపీ, బీఆర్ఎస్‌లకు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువ . మరోవైపు, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం గ్రామీణ తెలంగాణలో అత్యంత బలంగా ఉండి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తక్కువ స్థానాలను కలిగి ఉంది. కాబట్టి అర్బన్ సీట్లు భారీగా పెరిగితే కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కాంగ్రెస్ గ్రామీణ ఓటు బ్యాంకును మాత్రమే నమ్ముకుంటే సరిపోదని, నగర నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ కొత్త సమీకరణాలు స్పష్టం చేస్తున్నాయి. రూరల్ నియోజకవర్గాల్లో కూడా జనాభా ప్రకారం కొత్త స్థానాలు ఏర్పడతాయి కాబట్టి అక్కడ తులనాత్మకంగా కాంగ్రెస్‌కు పట్టు సాధించే వెసులుబాటు కూడా ఉంటుంది.

### పవర్ సెంటర్ అర్బన్ కారిడారే

రాబోయే డిలిమిటేషన్ తెలంగాణ పొలిటికల్ పవర్ సెంటర్‌ను రూరల్ కారిడార్ నుంచి అర్బన్ కారిడార్‌కు మళ్లించబోతోంది. ఏ పార్టీ అయితే గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న నూతన నియోజకవర్గాల్లో పట్టు సాధిస్తుందో, ఆ పార్టీకే రాష్ట్రంలో అధికార పీఠం దక్కే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. సామాజిక సమీకరణాలు, వలసదారుల ప్రభావం, ఐటీ-రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణే రేపటి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.

# 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ అర్హత

చేశారు. అలాగే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే 21 ఏళ్లకే చట్టసభలకు పోటీచేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రాల లీక్ వ్యవహారంపై విద్యార్థులు ఢిల్లీ వేదికగా ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఉద్రిక్తతలు తలెత్తగా పరిస్థితిని చక్కదిద్దేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో నెక్లెస్ రోడ్డులో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. మన దేశంలో 30శాతంగా ఉన్న యువతకు చట్టసభలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేలా ఒత్తిడి తెచ్చి అప్పటి వరకూ నిరసనలు చేసిన విద్యార్థులకు రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యువత తలుచుకుంటే చేయలేనిదంటూ ఏదీ లేదన్న రేవంత్ రెడ్డి, జెన్ జీ యువతలో నేడు విజయదరహాసం కనిపిస్తోందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఘనతను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోమన్న రేవంత్ రెడ్డి ఇది పూర్తిగా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన ఫలితమన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ కేంద్ర ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలలో ఇంకా కొన్ని డిమాండ్లు అపరిష్కృతంగా ఉన్నాయన్న రేవంత్ రెడ్డి విద్యార్థుల మీద నమోదు చేసిన కేసులను ఇంకా ఉపసంహరించుకోలేదని గుర్తు చేశారు. సోమవారం నాటికి అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మరోవైపు ఆగస్టు మొదటి వారంలో తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి 21 ఏళ్లకే చట్టసభలలో పోటీ చేసే అవకాశం కల్పించాలని తీర్మానం చేసి ప్రధాని మోదీకి పంపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# పొగాకు రైతులకు శాశ్వత భరోసా కల్పించాలి

ముందు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొగాకు రైతులను ఆదుకునేలా వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధరలోటు భర్తీ వంటి మూడు కీలక ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతం కాకుండా షార్ట్‌టర్మ్, మీడియం టర్మ్, లాంగ్‌టర్మ్ వ్యూహాలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం అందించే సహాయం, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర చర్చలు జరిపి తుది నిర్ణయానికి రావాలని సూచించారు. పొగాకు పంటను ఒకటి లేదా రెండు సంవత్సరాల పాటు నిల్వ ఉంచే అవకాశాలపై అధ్యయనం చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందించాలని అధికారులకు సీఎం సూచించారు. లో, మీడియం, హైగ్రేడ్ పొగాకును విక్రయించే విధానంపై ట్రేడర్లతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ ఈ సమస్యలో భాగస్వాములేనని, అందరి సహకారంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రేడర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలు తలెత్తకుండా సమర్థవంతమైన విధానం అమలు చేయవచ్చన్నారు. సీఎం కర్నూలు పర్యటనకు వెళ్లిన అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులతో కలిసి ప్రముఖ పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులకు మేలు చేసేలా బయ్యర్లు కూడా ముందుకు రావాలని కోరారు. ట్రేడర్ల నుంచి వచ్చే ప్రతిపాదనలను పరిశీలించి సోమవారం మరోసారి సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా, నరసరావుపేట, రాజానగరం, పోలవరం ప్రాంతాల ప్రజాప్రతినిధులు పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి వర్చువల్ విధానంలో సమావేశంలో పాల్గొన్నారు.

# పదవులు తాత్కాలికం.. ప్రజా విశ్వాసమే ప్రధానం

ప్రజల విశ్వాసమే అత్యంత ప్రధానమని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవడం, తమ పార్టీ విశ్వసించే విలువలను ప్రతిబింబిస్తోందని పదవి కంటే బాధ్యతకు, స్వప్రయోజనం కంటే దేశానికి ప్రాధాన్యమనే విధానాన్ని తెలియజేస్తోందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ అందించిన సుదీర్ఘ సేవలు, కృషికి ధన్యవాదాలు తెలియజేసిన బండి సంజయ్, ఇదే బీజేపీ ఇదే ప్రజాస్వామ్యం ఎల్లప్పుడూ దేశమే ప్రథమం అంటూ ట్వీట్ చేశారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధానమంత్రికి పంపించారు. అనంతరం 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టిన ధర్మేంద్ర ప్రధాన్ యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్లు తెలిపారు. పదిరోజులుగా జరుగుతున్న పరిణామాలు ఎంతగానో బాధించాయన్న ధర్మేంద్ర ప్రధాన్ తాను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదన్నారు. నీట్ అక్రమాలు తెలిసిన వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించామని మళ్లీ పరీక్ష నిర్వహించామన్నారు. దేశ విద్రోహ శక్తులకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

## రియల్ ఎస్టేట్ కుదేలైందనే

# ప్రచారంలో నిజం లేదు

40 శాతం వరకు ఫ్లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

### హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం

గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

### హైదరాబాద్ నగర అభివృద్ధికి చర్యలు

'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుంది'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్దమవుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

### సుందరమైన నగరంగా హైదరాబాద్

'ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఫ్లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన్ స్థానంలో ప్రహ్లాద్ జోషి

రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన గెజిట్ ప్రకారం "ప్రధానమంత్రి సలహా మేరకు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 75లోని క్లాజ్ (2) ప్రకారం కేంద్ర క్యాబినెట్ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను భారత రాష్ట్రపతి తక్షణమే ఆమోదించారు అంతేకాకుండా, ప్రధాని సలహా మేరకు మరో క్యాబినెట్ మంత్రి అయిన ప్రహ్లాద్ జోషికి, ఆయన ప్రస్తుత పోర్ట్‌ఫోలియోతో పాటు విద్యా శాఖ బాధ్యతలను కూడా అప్పగించాలని రాష్ట్రపతి ఆదేశించారు" అని పేర్కొన్నారు.

### ఎవరీ ప్రహ్లాద్ జోషి.?

బీజేపీలో సీనియర్ నాయకుడైన ప్రహ్లాద్ జోషి కర్ణాటకలోని ధర్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మోదీ మంత్రివర్గంలో ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ, న్యూ అండ్ పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. అంతేకాదు, అంతర్జాతీయ సౌర కూటమికి ఆయన అధ్యక్షుడిగానూ ఉన్నారు. మోదీ 2.0లో బొగ్గు గనుల శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా చేశారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదం, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోరుతూ దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ప్రహ్లాద్ జోషికి మోదీ విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించడం కీలకంగా మారింది. పరీక్షల నిర్వహణలో విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంపొందంచడం సహా విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం బాధ్యతలు తీసుకుంటున్న జోషి ఏ మేరకు కృషి చేస్తారో చూడాలి మరీ. కాక్రోచ్ జనతా పార్టీ మూడు డిమాండ్లలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నీట్ లీక్‌తో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం, ఉద్యమం సమయంలో విద్యార్థులపై పెట్టిన కేసులు కొట్టివేయడం. ఈ మూడింటికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో ఆందోళనలను విరమిస్తున్నట్టు కాక్రోజ్ జనతా పార్టీ ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సీజేపీ ప్రతినిధులు సౌరబ్ దాస్, అశుతోష్ రాంకీ సమావేశం తర్వాత ఈ ప్రకటన వెలువడింది.

# గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- ప్రతిష్టాత్మకంగా.. విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టి కృషి అవసరం: హోంమంత్రి వంగలపూడి అనిత**




**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. శనివారం విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని హోంమంత్రి సూచించారు. మార్గమంతా అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూడాలని, అన్ని కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

గిరి ప్రదక్షిణ అనంతరం సింహాచలం కొండపై దర్శనానికి వచ్చే భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రద్దీని తగ్గించే ఉద్దేశంతో పలు ప్రాంతాల్లో నమూనా ఆలయాలను ఏర్పాటు చేసి, అక్కడ కూడా భక్తులు కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించుకునే అవకాశం కల్పించాలని చెప్పారు. నమూనా ఆలయాల వద్ద కూడా పోలీసు భద్రత కల్పించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, లైటింగ్ తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే ప్రతి భక్తి సురక్షితంగా, ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, దేవస్థానం ఈవో వెంకటరావు, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

# మీ ఆరోగ్యం.. మీ బాధ్యత

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, విద్య, వైద్యం కోసం కుటుంబాలు అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే తీసుకునేలా సంజీవని పథకాన్ని రూపొందించామని తెలిపారు. ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ ఆభా హెల్త్ ఐడీలు జారీ చేస్తామని వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్రస్థాయి ఆస్పత్రుల వరకు ఆరోగ్య సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు.

### వ్యాధి రాకముందే గుర్తించే వ్యవస్థ

సంజీవని పథకం కేవలం చికిత్సకే పరిమితం కాదని, ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించడమే లక్ష్యమని సీఎం వివరించారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు ఆరోగ్యం, బాలల ఆరోగ్య పరీక్షలు, 108, 104 సేవలు, ఈ-ఔషధి, ల్యాబ్ సేవలను ఒకే డిజిటల్ వ్యవస్థలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ (ఏఐ), టెలిమెడిసిన్, రిమోట్ కేర్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతికతను కూడా సంజీవనిలో భాగం చేస్తామని వెల్లడించారు. ప్రజలు సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్ ద్వారా వైద్యుల అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ ఆరోగ్య రికార్డులను ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని, యోగా, వ్యాయామం, సమతుల్య ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

### సంక్షేమం.. అభివృద్ధి పెద్దపీట

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమానికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0, ప్రతి ఇంటికి సౌర విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. భూ రికార్డులను బ్లాక్‌చైన్ సాంకేతికతతో భద్రపరుస్తున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేస్తామని వెల్లడించారు.

### వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తాం

రాయలసీమ సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.1,768 కోట్లతో వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడు సంవత్సరాల్లో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు. కడప స్టీల్ ప్లాంట్‌లో 2028 నాటికి ఉత్పత్తి ప్రారంభమవుతుందని, హీరో, ఎల్‌జీ, దాల్మియా వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు.

### గత ప్రభుత్వంపై విమర్శలు

గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని, ఒక్క ఎకరాకు కూడా కొత్తగా సాగునీరు అందించలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు.

### ప్రజల మధ్యే సీఎం

సభ అనంతరం జిల్లా అధికారుల పనితీరును బహిరంగ వేదికపై సమీక్షించిన సీఎం, మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు. స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును అందజేశారు. తాను ప్రజల మధ్య ఉండే ముఖ్యమంత్రినని, గత ప్రభుత్వంలా పరదాలు కట్టుకుని తిరగడం, చెట్లు నరికించి సభలు నిర్వహించడం తన విధానం కాదని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారాలు చూపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, కర్నూలు జిల్లా ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రెజ్లర్‌లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తా

**అమీర్ పేట** రెజ్లర్ లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. శనివారం అమీర్ పేట లోని మున్సిపల్ స్టేడియంలో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని 70 వ్యాయామశాలల నిర్వాహకులకు రెజ్లింగ్ మ్యాట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్ ను కుస్తీ పోటీలు గా, రామాయణ, మహాభారతం కాలంలో మల్లయుద్ధం గా పిలుచుకునే వారని పేర్కొన్నారు. 5 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కుస్తీ పోటీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగా కొంత ఇబ్బందులు ఉన్నప్పటికీ, కుస్తీపై ఉన్న అభిమానం తో అనేకమంది వారసత్వం గా పోటీలకు శిక్షణ పొందుతున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం 150 మంది రెజ్లర్లు వివిధ కెటగిరీలలో జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని, వారికి అవసరమైన ట్రాక్, షూస్, రవాణా ఖర్చులను తన జీవితకాలం పాటు అందిస్తానని ప్రకటించారు. వ్యాయామశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వలన కొంత ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రెజ్లర్లు మట్టిలో కుస్తీ పోటీల ప్రాక్టీస్ చేస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా 70 వ్యాయామశాలలకు ఒక్కో వ్యాయామశాల కు 10 చొప్పున మ్యాట్ లను అందజేసినట్లు చెప్పారు. వ్యాయామశాలల అభివృద్ధి, రెజ్లర్ లకు చేయూత అందించేలా భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ధాతలను ఆయన సన్మానించారు.

# రాజ్యాలు మారినా... రాజసం చెక్కుచెదరలేదు

**- విజయనగర వైభవానికి చిరస్మరణీయ చిరునామా... చంద్రగిరి కోట**

**- తాళికోట యుద్ధం తర్వాత సామ్రాజ్యానికి ఆశ్రయంగా మారిన అజేయ దుర్గం**

**- తిరుమల శ్రీవారి సన్నిధికి నీడగా చరిత్రను సజీవంగా నిలిపిన రాజధాని**

(వెంకట్ -- ప్రశ్న న్యూస్ ఏపీ బ్యూరో)



"చంద్రగిరి కోట కేవలం రాతి గోడల సముదాయం కాదు... విజయనగర సామ్రాజ్య చివరి శ్వాసను, తిరుమల శ్రీవారి వైభవాన్ని, దక్షిణ భారత చరిత్రను తన గుండెల్లో దాచుకున్న సజీవ చరిత్ర గ్రంథం."

## ప్రత్యేక కథనం

ఉదయించే సూర్యుడి తొలి కిరణాలు తిరుమల శేషాచల శిఖరాలను తాకుతుంటే... వాటి కాంతిలో మరింత గంభీరంగా కనిపించే ఓ చారిత్రక నిర్మాణం మనల్ని గత వైభవంలోకి తీసుకెళ్తుంది. అదే చంద్రగిరి కోట. తిరుపతికి సమీపంలో ఉన్న ఈ దుర్గం కేవలం ఒక పర్యాటక ప్రాంతం కాదు; దక్షిణ భారత చరిత్రలో అత్యంత కీలకమైన రాజకీయ పరిణామాలకు వేదికగా నిలిచిన మహా చారిత్రక కేంద్రం.ఈ కోటలోని ప్రతి రాయి ఒక రాజవంశం కథ చెబుతుంది. ప్రతి ప్రహరీ ఒక యుద్ధాన్ని గుర్తు చేస్తుంది. ప్రతి ద్వారం విజయనగర సామ్రాజ్య ఔన్నత్యాన్ని ప్రతిధ్వనిస్తుంది. ఒకప్పుడు రాజులు సంచరించిన వీధుల్లో నేడు పర్యాటకులు నడుస్తున్నారు. కానీ ఆ గోడలు ఇప్పటికీ శతాబ్దాల చరిత్రను మౌనంగా కాపాడుతున్నాయి.

## చంద్రగిరి... పేరులోనే ఓ చరిత్ర

"చంద్రగిరి" అనే పేరుకు చరిత్ర, పురాణం రెండూ ముడిపడి ఉన్నాయి. స్థానిక కథనాల ప్రకారం చంద్రుడు ఈ కొండపై తపస్సు చేయడంతో ఈ ప్రాంతానికి "చంద్రగిరి" అనే పేరు వచ్చిందని చెబుతారు. మరికొందరు కొండ ఆకృతి చంద్రవంకను పోలి ఉండటం వల్ల ఈ పేరు స్థిరపడిందని పేర్కొంటారు.ఏ కథనాన్ని తీసుకున్నా, ఈ ప్రాంతం శతాబ్దాలుగా రాజుల దృష్టిని ఆకర్షించిన వ్యూహాత్మక కేంద్రం అనే విషయంలో చరిత్రకారులందరూ ఏకీభవిస్తారు.ఆవిర్భావం... ఒక చిన్న దుర్గం నుంచి మహా సామ్రాజ్య రాజధాని వరకుచంద్రగిరి కోట మూలాలు దాదాపు 11వ శతాబ్దం నాటివిగా భావిస్తారు. ఈ ప్రాంతాన్ని పాలించిన యాదవరాయులు కొండపై తొలి రక్షణ దుర్గాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. తిరుమల--తిరుపతి ప్రాంతాన్ని రక్షించడం, శత్రు దండయాత్రలను అడ్డుకోవడం, పరిపాలనను పటిష్ఠం చేయడం ప్రధాన లక్ష్యాలుగా ఈ దుర్గం రూపుదిద్దుకుంది.తర్వాతి కాలంలో ఈ ప్రాంతం విజయనగర సామ్రాజ్య ఆధీనంలోకి రావడంతో చంద్రగిరి ప్రాధాన్యం మరింత పెరిగింది. సహజ రక్షణ కలిగిన కొండ, చుట్టూ అడవులు, సమీపంలో తిరుమల క్షేత్రం, వ్యాపార మార్గాలకు అనుకూలమైన స్థానం---ఈ నాలుగు అంశాలు చంద్రగిరిని అపూర్వమైన వ్యూహాత్మక కేంద్రంగా మార్చాయి. విజయనగర సామ్రాజ్యంతో విడదీయరాని అనుబంధం1336లో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం దక్షిణ భారతదేశంలో హిందూ సంస్కృతి, కళలు, సాహిత్యం, దేవాలయ సంప్రదాయాలకు అండగా నిలిచింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో సామ్రాజ్యం తన అత్యున్నత శిఖరాన్ని చేరుకుంది.విజయనగర రాజులకు తిరుమల శ్రీవారిపై అపారమైన భక్తి. వారు తరచూ తిరుమలను సందర్శించేవారు. ఆలయానికి విరాళాలు, భూములు, ఆభరణాలు సమర్పించేవారు. ఈ నేపథ్యంలో తిరుమలకు సమీపంలో ఉన్న చంద్రగిరి పరిపాలనా దృష్ట్యా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.
కాలక్రమేణా చంద్రగిరి రాజప్రతినిధుల కేంద్రంగా, సైనిక స్థావరంగా, ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా అభివృద్ధి చెందింది.

## తాళికోట యుద్ధం... చరిత్రను మార్చిన మలుపు

1565లో జరిగిన తాళికోట యుద్ధం విజయనగర సామ్రాజ్య చరిత్రలో కీలక మలుపు. డెక్కన్ సుల్తానుల సంయుక్త దాడిలో విజయనగర సైన్యం ఓడిపోవడంతో హంపి నగరం విధ్వంసానికి గురైంది. రాజధానిని అక్కడ కొనసాగించడం అసాధ్యమైంది.అలాంటి క్లిష్ట సమయంలో సామ్రాజ్యాన్ని కాపాడేందుకు సురక్షితమైన కేంద్రం అవసరమైంది. అప్పుడు రాజులు తమ దృష్టిని చంద్రగిరిపై కేంద్రీకరించారు.

## కొండపై అజేయంగా నిలిచిన ఈ దుర్గం,

తిరుమలకు సమీపం, సహజ రక్షణ, పరిపాలనకు అనువైన భౌగోళిక పరిస్థితులు---ఈ అన్ని కారణాలు కలిసి చంద్రగిరిని కొత్త రాజధానిగా నిలబెట్టాయి.
చంద్రగిరి... విజయనగరానికి చివరి రాజధాని హంపి పతనం తర్వాత విజయనగర పాలకులు కొంతకాలం పెనుకొండను కేంద్రంగా చేసుకున్నప్పటికీ, అనంతరం వెంకటపతి రాయల కాలంలో చంద్రగిరి ప్రధాన రాజధానిగా ఎదిగింది. ఇక్కడి నుంచే సామ్రాజ్య పరిపాలన కొనసాగింది. విదేశీ రాయబారులను ఆహ్వానించడం, సైనిక వ్యూహాలు రూపొందించడం, రాజసభలు నిర్వహించడం, ఆలయాల పరిపాలన పర్యవేక్షించడం వంటి కీలక కార్యక్రమాలు చంద్రగిరి నుంచే జరిగాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాజకీయాలకు దిశానిర్దేశం చేసిన నిర్ణయాలు వెలువడిన ప్రదేశంగా చంద్రగిరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.

## తిరుమలతో ఆధ్యాత్మిక బంధం

చంద్రగిరి రాజధానిగా ఎదగడానికి మరో ప్రధాన కారణం తిరుమల క్షేత్రానికి సమీపంలో ఉండటమే. విజయనగర రాజులు తమను శ్రీవారి సేవకులుగా భావించేవారు. తిరుమల ఆలయానికి భూములు, గ్రామాలు, బంగారం, ఆభరణాలు దానం చేయడమే కాకుండా ఆలయ పరిపాలనకు ప్రత్యేక శ్రద్ధ చూపేవారు.చంద్రగిరి రాజసభలో తీసుకున్న అనేక నిర్ణయాలు



తిరుమల ఆలయ అభివృద్ధికి సంబంధించినవేనని చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. ఈ కారణంగానే చంద్రగిరి కోటను "తిరుమల ఆలయానికి నీడ"గా చరిత్రకారులు అభివర్ణిస్తారు.

## చరిత్రను కాపాడుతున్న రాతి గోడలు

నేడు చంద్రగిరి కోట నిశ్శబ్దంగా కనిపించినా, ఒకప్పుడు ఇక్కడ రాజసభల సందడి, సైన్యాల కవాతులు, దౌత్య చర్చలు, ఉత్సవాలు, పరిపాలనా సమావేశాలు నిరంతరం జరిగేవి. ఆ వైభవాన్ని గుర్తుచేసే ప్రతి గోడ నేటికీ కాలానికి సవాల్ విసురుతోంది.చంద్రగిరి కోటను సందర్శించడం అంటే కేవలం ఒక చారిత్రక కట్టడాన్ని చూడటం కాదు... విజయనగర సామ్రాజ్యం చివరి అధ్యాయాన్ని కళ్లారా చదవడం. శ్రీవారి నీడలో రాజధాని... భక్తి, భద్రత, భరణికి చిరునామా చంద్రగిరి విజయనగర రాజుల ఆధ్యాత్మిక కేంద్రంగా వెలిగిన కోట.. తిరుమల ఆలయ పరిపాలనకు అండగా నిలిచిన చారిత్రక దుర్గం "తిరుమలలో శ్రీవారి నిత్యారాధనలు కొనసాగితే... వాటి వెనుక పరిపాలనా శక్తిగా నిలిచింది చంద్రగిరి రాజసభ. భక్తికి రాజధాని తిరుమల అయితే... భద్రతకు రాజధాని చంద్రగిరి."' తిరుమల శ్రీవారి ఆలయం ప్రపంచంలోనే అత్యంత వైభవోపేతమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటి. అయితే, ఆ ఆలయం శతాబ్దాల పాటు సురక్షితంగా, సమర్థంగా నిర్వహించబడటానికి వెనుక ఒక శక్తివంతమైన రాజపాలన నిలిచింది. ఆ పాలనకు కేంద్రంగా వెలుగొందింది చంద్రగిరి కోట. తిరుమల కొండల అడుగున కొద్ది దూరంలో ఉన్న ఈ దుర్గం కేవలం సైనిక స్థావరం మాత్రమే కాదు. అది భక్తి, పరిపాలన, సంస్కృతి, సంప్రదాయాల సంగమ క్షేత్రం. విజయనగర రాజులు తమ రాజసింహాసనాన్ని చంద్రగిరిలో ఉంచినా, తమ హృదయాన్ని తిరుమల శ్రీవారి పాదాల వద్ద ఉంచారు.

## రాజుల ఆరాధ్య దైవం... శ్రీ వేంకటేశ్వరస్వామి



విజయనగర సామ్రాజ్య చరిత్రను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. రాజులు తమ విజయాలను, సంపదను, రాజ్యాన్ని శ్రీవారి కృపగా భావించేవారు. యుద్ధానికి వెళ్లే ముందు, విజయంతో తిరిగి వచ్చిన తర్వాత కూడా తిరుమల శ్రీవారిని దర్శించడం ఆనవాయితీగా ఉండేది.శ్రీకృష్ణదేవరాయలు అనేకసార్లు తిరుమలను దర్శించి విలువైన ఆభరణాలు, బంగారు కానుకలు సమర్పించారు. ఆయన తరువాతి పాలకులూ అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. హంపి పతనం అనంతరం చంద్రగిరి రాజధానిగా మారిన తరువాత ఈ అనుబంధం మరింత బలపడింది.

## తిరుమల ఆలయ పరిపాలనకు చంద్రగిరే కేంద్రం

చంద్రగిరి రాజధానిగా ఉన్న కాలంలో తిరుమల ఆలయ పరిపాలనపై రాజసభ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండేది. ఆలయానికి సంబంధించిన భూముల పరిరక్షణ - దేవదాయ గ్రామాల నిర్వహణ - ఉత్సవాల నిర్వహణ - ఆలయ ఉద్యోగుల నియామకాలు - ఆదాయ--వ్యయాల పర్యవేక్షణ - భక్తుల భద్రత వంటి కీలక అంశాలపై చంద్రగిరి పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు చారిత్రక శాసనాలు, ఆధారాలు తెలియజేస్తున్నాయి. తిరుమల ఆలయానికి విరాళంగా ఇచ్చిన అనేక గ్రామాల ఆదాయం ఆలయ సేవలకే వినియోగించేలా రాజులు ఆదేశాలు జారీ చేశారు.

## చంద్రగిరి నుంచే వెలువడిన చారిత్రక నిర్ణయాలు

విజయనగర సామ్రాజ్య చివరి దశలో అనేక కీలక పరిపాలనా నిర్ణయాలు చంద్రగిరి రాజసభలోనే తీసుకోబడ్డాయి. తిరుమల ఆలయ నిత్యకైంకర్యాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగాలని రాజులు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు శాసనాలు తెలియజేస్తాయి. ఆలయ ఆస్తులపై ఎవరూ అక్రమంగా కన్నేయకుండా కఠిన నిబంధనలు అమలు చేశారు.

## రాజధాని మారినా... శ్రీవారి సేవలో మార్పు రాకూడదన్నది విజయనగర పాలకుల సంకల్పం.


కోటలోని దేవాలయాలు... ఆధ్యాత్మిక సంపదకు నిలయం చంద్రగిరి కోటలో అనేక చిన్నా, పెద్ద దేవాలయాల ఆనవాళ్లు నేటికీ కనిపిస్తాయి. ప్రత్యేకంగా... - శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం - శివాలయం - ఆంజనేయస్వామి ఆలయం వంటి ఆలయాల శిథిలాలు, మండపాలు, శిల్ప భాగాలు కోటలో



కనిపిస్తాయి. వీటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయినా, వాటి నిర్మాణ శైలి విజయనగర కళా వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ ఆలయాల్లో రాజకుటుంబ సభ్యులు నిత్యపూజలు నిర్వహించేవారని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

## తిరుమల యాత్ర... రాజులకు నిత్యకృత్యం

చంద్రగిరి నుంచి తిరుమలకు రాజులు తరచూ వెళ్లేవారు. ప్రత్యేక ఉత్సవాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా రాజ కుటుంబ సభ్యులు పాల్గొనడం ఆనాటి సంప్రదాయం. రాజులు మాత్రమే కాదు... రాజసభలోని మంత్రులు, సేనాధిపతులు, పండితులు కూడా తిరుమల దర్శనాన్ని అత్యంత పవిత్ర కర్తవ్యంగా భావించేవారు. శ్రీవారి దర్శనం అనంతరం మాత్రమే ముఖ్యమైన రాజ్య నిర్ణయాలు తీసుకునేవారని కొన్ని చారిత్రక వర్ణనలు



సూచిస్తున్నాయి.

## భక్తి--పరిపాలన కలిసిన అపూర్వ నమూనా

విజయనగర రాజుల పాలనలో ఆధ్యాత్మికతకు ప్రత్యేక స్థానం ఉండేది. దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాదు; విద్య, కళ, సంగీతం, నృత్యం, అన్నదానం, సామాజిక సేవలకు కేంద్రాలుగా ఉండేవి. చంద్రగిరి రాజసభ ఈ వ్యవస్థను బలోపేతం చేసింది. తిరుమల ఆలయానికి చెందిన పండితులు, అర్చకులు, సేవకులకు తగిన గౌరవం, భద్రత, వేతన వ్యవస్థ కల్పించేందుకు పాలకులు చర్యలు తీసుకున్నారు.

## పురావస్తు శాఖ సంరక్షిస్తున్న అపురూప వారసత్వం

నేడు చంద్రగిరి కోటను భారత పురావస్తు సర్వేక్షణ శాఖ (Archaeological Survey of India - ASI) సంరక్షిస్తోంది. కోటలోని రాజా మహల్‌ను మ్యూజియంగా అభివృద్ధి చేశారు. విజయనగర కాలానికి చెందిన - శిల్పాలు - శాసనాలు - రాగి ఫలకాలు - ఆయుధాలు - నాణేలు - దేవతా విగ్రహాలు - మట్టి, రాతి కళాఖండాలు
ప్రదర్శనలో ఉంచారు. ఇవి విజయనగర సామ్రాజ్య సాంస్కృతిక వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేస్తున్నాయి. కోట గోడలు, మహల్‌లు, ప్రహరీలు దెబ్బతినకుండా పునరుద్ధరణ పనులు కూడా దశలవారీగా కొనసాగుతున్నాయి.

## సౌండ్ అండ్ లైట్ షో... చరిత్రకు కొత్త ఊపిరి

సాయంత్రం వేళ చంద్రగిరి కోటలో నిర్వహించే సౌండ్ అండ్ లైట్ షో సందర్శకులను విజయనగర కాలంలోకి తీసుకెళ్తుంది. వెలుగు--నీడల మధ్య రాజుల గాథలు, యుద్ధాలు, తిరుమలతో అనుబంధం, చంద్రగిరి వైభవం ప్రేక్షకుల ముందుకు ఆవిష్కృతమవుతాయి. ఇది చరిత్రను పుస్తకాల్లోనే కాకుండా ప్రత్యక్ష అనుభూతిగా మలిచే అరుదైన కార్యక్రమంగా నిలిచింది.

## వారసత్వాన్ని కాపాడటం... మన బాధ్యత

చంద్రగిరి కోట కేవలం పురావస్తు కట్టడం కాదు. అది తెలుగు జాతి గర్వకారణం. విజయనగర సంస్కృతికి ప్రతీక. తిరుమల శ్రీవారి చరిత్రకు మౌన సాక్షి. ఈ కోటను పరిరక్షించడం అంటే కేవలం రాతి గోడలను కాపాడటం కాదు... మన చరిత్రను, మన సంస్కృతిని, మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించడం.

## చంద్రగిరి--తిరుమల అనుబంధం... ఒక చూపులో

- విజయనగర సామ్రాజ్య చివరి రాజధాని -- చంద్రగిరి. - తిరుమల ఆలయ పరిపాలనకు ప్రధాన కేంద్రంగా రాజసభ. - శ్రీవారికి రాజులు అనేక భూదానాలు, ఆభరణాలు సమర్పించారు. - కోటలో చెన్నకేశవ, శివ, ఆంజనేయ ఆలయాల ఆనవాళ్లు నేటికీ కనిపిస్తాయి. - రాజా మహల్‌లో ప్రస్తుతం ASI మ్యూజియం నిర్వహిస్తోంది. - సౌండ్ అండ్ లైట్ షో ద్వారా విజయనగర చరిత్రను సజీవంగా పరిచయం చేస్తున్నారు చంద్రగిరి కోటను దర్శించిన ప్రతి ఒక్కరికీ ఒక విషయం స్పష్టమవుతుంది. ఇక్కడి గోడలు కేవలం రాజుల శౌర్యాన్ని మాత్రమే కాదు... తిరుమల శ్రీవారి పట్ల వారి అచంచల భక్తిని కూడా ప్రతిధ్వనిస్తున్నాయి. అందుకే చంద్రగిరి కోట చరిత్రలో ఒక దుర్గం మాత్రమే కాదు... భక్తి, పరిపాలన, వారసత్వం కలిసిన మహోన్నత అధ్యాయం.

# హేమాద్రి తొలి ఏకాదశి మహోత్సవం వైభవం.. వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**- 'గోవింద' నామస్మరణతో మారుమోగిన ఆలయం**

**- విశేష పూజలు, తీర్థప్రసాదాలు**

**- సహకరించిన అందరికీ ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి కృతజ్ఞతలు**





ఘట్కేసర్ ( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి దాయర వేంకులోని హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం "గోవింద... గోవింద..." నామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్ట్, అర్చకులు, స్వచ్ఛంద సేవకులు, పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహోత్సవాన్ని విజయవంతం చేసిన భక్తులు, దాతలు, సేవకులు, పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులు సహా సహకరించిన ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు జూలై 31 వరకు దరఖాస్తులు

**- నవంబర్ 28న ప్రవేశ పరీక్ష -- అర్హులైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజనం**




కీసర( ప్రశ్న న్యూస్) జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులను జూలై 31, 2026 వరకు స్వీకరిస్తున్నట్లు ప్రధానాచార్యులు కె. మాధవరావు తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించబడుతుందని, ఎలాంటి దరఖాస్తు రుసుము లేదన్నారు. మొత్తం 40 సీట్లకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. నవంబర్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య, వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సౌకర్యాలు కల్పించబడతాయని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# డ్రోన్లతో అడవులకు ప్రాణం

**- వెయ్యి ఎకరాల్లో సీడ్ బాల్స్ జల్లింపు**

**- క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుద్ధరణకు సాంకేతికత వినియోగం**

**- రాష్ట్రవ్యాప్తంగా 6,500 హెక్టార్లలో 63 లక్షల విత్తన బంతుల పంపిణీ పూర్తి**

**- 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనకు వేగం పెంచండి.**

**- మొలకల సంరక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాలి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**





అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుద్ధరణకు సాంకేతికతను వినియోగిస్తూ ప్రభుత్వం వినూత్న అడుగులు వేస్తోంది. మనుషులు చేరుకోలేని లోయలు, కొండ ప్రాంతాల్లో తొలిసారిగా డ్రోన్ల సాయంతో విత్తన బంతులు (సీడ్ బాల్స్) వెదజల్లే కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ జారవిడవగా, రాష్ట్రవ్యాప్తంగా 6,500 హెక్టార్లలో 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ పంపిణీ పూర్తయినట్లు అటవీశాఖ అధికారులు
వెల్లడించారు. అటవీ, పర్యావరణ శాఖల మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం అటవీశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీడ్ బాల్స్ పంపిణీ, డ్రోన్ సాంకేతికత వినియోగం, తదుపరి లక్ష్యాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, ఇప్పటివరకు 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియ పూర్తైంది. ఇందులో సుమారు 6 వేల హెక్టార్లలో మానవ వనరుల ద్వారా 59 లక్షల సీడ్ బాల్స్, మరో వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల ద్వారా విత్తన బంతులు జారవిడిచారు.రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి సీడ్ బాల్స్ కార్యక్రమం కీలకమని పేర్కొన్న ఆయన, విత్తన బంతులు చల్లడమే కాకుండా మొలకెత్తిన మొక్కలను సంరక్షించే బాధ్యతను కూడా అధికారులు, సిబ్బంది తీసుకోవాలని స్పష్టం చేశారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో మొక్కల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

# ఉత్తరాంధ్రకు కొత్త గుమ్మం

**- చారిత్రాత్మక ఘట్టంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి**




విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఈ ప్రాంత అభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ఘట్టమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఆగస్టు 1న జరగనున్న ప్రారంభోత్సవ వేడుకలను ప్రజల పండుగగా నిర్వహించాలని, ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్రలో ఉపాధి, పెట్టుబడులు, పర్యాటకం, వ్యాపారం, విమానయాన రంగాల్లో విస్తృత అవకాశాలు ఏర్పడనున్నాయని హోం మంత్రి అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దిశను చూపనున్న ఈ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి చరిత్రలో నిలిచే వేడుకగా మార్చాలని హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు.

# ఎర్రచందనంపై ఉక్కుపాదం

- స్మగ్లర్లకు సహకరిస్తే ఎవరినీ విడిచిపెట్టం.
- అటవీశాఖ అధికారులైనా కఠిన చర్యలే
- రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగల స్వాధీనం
- 'ఆపరేషన్ అరణ్య'పై స్వయంగా పర్యవేక్షణ చేస్తా: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఎర్రచందనం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. స్మగ్లర్లకు సహకరించే వారెవరైనా సరే, వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు మరింత కఠిన కార్యాచరణ అమలు చేస్తామని, 'ఆపరేషన్ అరణ్య' పురోగతిని తాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలం వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద జరిగిన భారీ ఎర్రచందనం పట్టివేత ఘటనపై శనివారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను, వారికి సహకరించిన అటవీశాఖ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసిన వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, స్టేట్ ఇంటెలిజెన్స్ విభాగం అందించిన విశ్వసనీయ సమాచారంతో తెల్లవారుజామున నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో, ఇంటి సామగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ వాహనంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అటవీ సంపద రాష్ట్రానికి అమూల్యమైన ఆస్తి అని పేర్కొన్న ఆయన, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అటవీ ప్రాంతాల్లో నిఘాను కట్టుదిట్టం చేయాలని సూచించారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న బొండా ఉమ

- బీ-ఫారం పట్టాదారులకు శుభవార్త, తొలి విడతలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి పట్టాలు అందజేత
- దశలవారీగా అందరికీ న్యాయం చేస్తాం
- ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం మా బాధ్యత



విజయవాడ(ప్రశ్న న్యూస్) బీ-ఫారం పట్టాదారులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శనివారం తొలి విడతగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీ-ఫారం పట్టాదారుల్లో ఆనందం నెలకొంది. విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రాంతాలకు చెందిన బీ-ఫారం పట్టాదారులకు తొలి విడతలో ఒక్కో డివిజన్ నుంచి ఒక్కొక్కరి చొప్పున ముగ్గురికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, పట్టాలను బొండా ఉమామహేశ్వరరావు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. బీ-ఫారం పట్టాదారులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా దశలవారీగా అందరికీ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, సింగం వెంకన్న, పీవీఆర్, 1వ డివిజన్ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కాపు ఆత్మగౌరవానికి చిరునామా: ముద్రగడ్డ

**- జీవితాంతం సమాజ హక్కుల కోసం పోరాడిన మహానేతకు పార్టీలకు అతీతంగా ఘన నివాళులు**

**- విజయవాడలో త్వరలో ముద్రగడ్డ పద్మనాభం విగ్రహావిష్కరణ: ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు.**



గుంటూరు(ప్రశ్న న్యూస్) కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం సాగించిన మహానేత ముద్రగడ్డ పద్మనాభంకు పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, కాపు జేఏసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గుంటూరులో కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ముద్రగడ్డ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ, ముద్రగడ్డ పద్మనాభం మరణం కాపు జాతికి తీరని లోటని అన్నారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేగా అనేక పదవులు చేపట్టినా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ హితం కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని కొనియాడారు. కాపు రిజర్వేషన్లు, విద్యా అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ముద్రగడ్డ ఎన్నో ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించారని గుర్తు చేశారు. ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గానికి సంబంధించిన న్యాయమైన డిమాండ్లను పార్టీ అధిష్ఠానం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని బొండా ఉమా హామీ ఇచ్చారు. హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుత మార్గంలో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా త్వరలో విజయవాడలో మహానేత ముద్రగడ్డ పద్మనాభం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ప్రకటించారు. ఆ కార్యక్రమంలో కాపు సామాజిక వర్గం సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని మహానేతకు ఘనంగా నివాళులర్పించాలని కోరారు. సభ ముగింపులో "జోహార్ వంగవీటి మోహనరంగా... జోహార్ ముద్రగడ్డ పద్మనాభం..." అంటూ నినదిస్తూ నాయకులు, కార్యకర్తలు మహానేతలకు తమ గౌరవాన్ని చాటుకున్నారు కాపు హక్కుల కోసం జీవితాంతం ఉద్యమం. రిజర్వేషన్లు, సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేగా ప్రజాసేవ. సమాజ హితం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేసిన నాయకుడు. త్వరలో విజయవాడలో విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు.

# యంఎన్‌జే ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిన నూతన ఫర్నిచర్





నాంపల్లి (ప్రశ్న న్యూస్) యంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి పిల్లల వార్డులో నూతన ఫర్నిచర్ అందుబాటులోకి రావడంతో రోగులకు సేవలు అందించడం ఎంతో సౌకర్యవంతంగా ఉందని ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కామధేను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంపిల్స్ సేకరించేందుకు ఉపయోగించే టేబుల్స్, కుర్చీలు, స్టూల్లు, ఇతర మెటీరియల్ (1.5 లక్షల విలువైన) ను విరాళంగా అందించారు. దీంతో అందుబాటులోకి వచ్చిన ఈ నూతన ఫర్నిచర్ తో రోగులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించే అవకాశం ఏర్పడిందని సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు. మానవ సేవే మాధవ సేవ అనే గొప్ప లక్ష్యంతో తమ ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డు నిర్వాహకు అవసరమయ్యే ఫర్నిచర్ ను విరాళంగా అందజేసిన కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్ తో పాటు ఫౌండేషన్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిల్పా రెడ్డి, డాక్టర్ ఖలీల్, డాక్టర్ హదస్సా, డాక్టర్ రహెమాన్, చిలివేరి నాగరాజు, లక్ష్మీనారాయణ, పద్మావతి, స్వప్న, సుమలత, దీప్తి, వంశీ, భరత్, అఖిల్, వినోద్, చిట్టిబాబు, సుజాత, కరిష్మా, సోనియా తదితరులు పాల్గొన్నారు.

# పాండురంగ ఆశ్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతికి ఘన సత్కారం





**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని పాండురంగ ఆశ్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి పాండురంగ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం భావనంద ఆశ్రమాన్ని సందర్శించిన ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అప్పాల సత్యనారాయణ శర్మ, అప్పాల రసరాజు శర్మ కమిషనర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధ్వజారోహణంతో తాళ్లపాకలో బ్రహ్మోత్సవాల వైభవారంభం

**- శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్ధేశ్వరస్వామివారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ**

**- ఆగస్టు 3న పుష్పయాగంతో ఉత్సవాలకు ముగింపు**



**తిరుపతి/తాళ్లపాక(ప్రశ్న న్యూస్)** అన్నమయ్య జన్మభూమి తాళ్లపాకలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ చెన్నకేశవస్వామివారి, శ్రీ సిద్ధేశ్వరస్వామివారి ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణ మహోత్సవంతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజపటాలను ఆవిష్కరించి ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానించారు. శ్రీ చెన్నకేశవస్వామివారి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం నిర్వహించగా, రాత్రి శేషవాహన సేవ భక్తులను అలరించనుంది. జూలై 26 నుంచి ఆగస్టు 2 వరకు పల్లకీ సేవలు, హంసవాహనం, సింహవాహనం, హనుమంత వాహనం, గరుడసేవ, రథోత్సవం, అశ్వవాహనం, చక్రస్నానం, ధ్వజావరోహణం వంటి విశిష్ట ఉత్సవాలు నిర్వహించనున్నారు. అదే విధంగా శ్రీ సిద్ధేశ్వరస్వామివారి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం అనంతరం రాత్రి హంసవాహన సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చంద్రప్రభ వాహనం, చిన్నశేష వాహనం, సింహవాహనం, నందివాహనం, గజవాహనం, పార్వేట ఉత్సవం, వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం వంటి విశేష కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య జరగనున్నాయి. జూలై 30న రెండు ఆలయాల్లోనూ ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, ఆలయ అర్చకులు, అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆమనగల్ (ప్రశ్న న్యూస్) తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆమనగల్ మండల పరిధిలోని అయ్యసాగరం శ్రీ త్రిపురాంతకేశ్వర భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అఘోర వీరభద్ర స్వామి హోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ప్రసన్న స్వామి తెలిపారు. శనివారంనాడు వేకువజాము నుండే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు శేఖర్ తెలిపారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి స్వామివారి సేవలో భక్తులు తరించారు.

# మై టీడీపీ యాప్‌తో ప్రజల్లోకి ప్రభుత్వ విజయాలు

**- పార్టీ కేడర్‌కు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి డిజిటల్ క్లాస్**



**ఆత్మకూరు (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడంలో డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు శనివారం నిర్వహించిన డిజిటల్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని 'మై టీడీపీ' యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు లబ్ధిదారుల అభిప్రాయాలు, ఫొటోలు, వీడియోలు, ప్రచార కార్యక్రమాల వివరాలను మై టీడీపీ యాప్‌లో క్రమబద్ధంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం, మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, ఐటీ విభాగం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.(

## రాంపల్లి పారిశ్రామిక ప్రాంతానికి మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ప్రారంభం**



ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్ ) రాంపల్లి పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు మాట్లాడుతూ, పాతికేళ్లుగా పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, రోడ్లు దారుణంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 1 వరకు సంతకాల సేకరణ కొనసాగుతుందని, సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చింతకింది అశోక్‌తో పాటు 70 మందికి పైగా పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌కు ఈటల రాజేందర్ ఘన సన్మానం

**- యువతను సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచన**



కీసర (ప్రశ్న న్యూస్) నూతనంగా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాగం అర్జున్‌ను మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ తన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, యువతలో సేవాభావాన్ని పెంపొందిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాగం అర్జున్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. మేడ్చల్ జిల్లాలో యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీని మరింత బలోపేతం చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాగం అర్జున్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈటల రాజేందర్ మార్గదర్శకత్వంలో పార్టీ సిద్ధాంతాల ప్రచారం, యువత సమస్యల పరిష్కారం, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీను, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, బీజేపీ, బీజేవైఎం జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాగం అర్జున్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీశైలంలో ఆలయం అభివృద్ధి చేస్తాం

**- సిద్ధవటం మహా పుణ్యక్షేత్రం**

**- చైర్మన్,, పోతు గుంట రమేష్ నాయుడు**



**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** శ్రీశైల దక్షిణ ముఖ ద్వారం పేరుగాంచిన జ్యోతి సిద్దేశ్వర ఆలయం అభివృద్ధి చేస్తామని శ్రీశైలం దేవస్థానం ఆలయ చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు తెలిపారు. సిద్ధవటం మండలంలోని జ్యోతి గ్రామంలో వెలిసిన జ్యోతి సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన శనివారందర్శించుకుని స్వామివారి విశిష్టతపై అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానానికి దక్షిణముఖ ద్వారమైన జ్యోతి సిద్దేశ్వర ఆలయాన్ని రూపురేఖలు మారుస్తామని త్వరలో ఆలయ అభివృద్ధికై శ్రీశైల దేవస్థానం పాలకమండలిలో సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి కొరకై తీర్మానం చేస్తామని ఆయన తెలిపారు సిద్ధవటం పెన్నా నది తీర ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలు ఉండడం మన కడప జిల్లా అదృష్టమని జ్యోతి క్షేత్రాన్ని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకొస్తామని గ్రామస్తులు మండల వాసులు ప్రతి ఒక్కరు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సిద్ధులు తపస్సు చేసిన సిద్ధవటం ఒక మహా పుణ్యక్షేత్రం అని పురాతనమైన కట్టడాలు శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని ఇలాంటి మహా పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు ఆయనకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి ఘనంగా శాలవతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ఆలయ ఈఈ మురళి టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు సుబ్రమణ్యం రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు సింగల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు, నిత్య పూజ కోన ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్రయ్య టిడిపి మండల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, ఎసి సెల్ మహిళా అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ, గ్రామ మాజీ సర్పంచ్ ప్రతినిధి, రవి , టిడిపి నేతలు పిచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి మల్లు రమణారెడ్డి, మల్లు విజయ భాస్కర్ రెడ్డి, టిడిపి యువనేత తుర్ర ప్రతాప్ నాయుడు ఐటీడీపీ అధ్యక్షులు హరి బిజెపి నేత, కాకర్ల విజయభాస్కర్ రెడ్డి, ఆలయ అర్చకులు తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## హెన్నాజిపేట లో నర్సరీ మొక్కల తనిఖీ చేసిన (యం పి డి ఓ) బి మారుతి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హెన్నాజిపేట గ్రామ పంచాయతీ ని (యం పి డి ఓ) బి మారుతి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం కొరకు మొక్కల తరలించడం ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, ఇలియాస్,ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. నర్సరీలో నాణ్యమైన మొక్కలను సిద్ధం చేసి, నిర్ణీత సమయంలో ప్లాంటేషన్ పూర్తి చేయాలని (యం పి డి ఓ) బి మారుతి అధికారులకు సూచించారు.

## కపిలేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

**- జూలై 26 నుంచి మూడు రోజులపాటు వైభవంగా వార్షిక ఉత్సవాలు**



**తిరుపతి(ప్రశ్న న్యూస్)**తిరుపతిలోని ప్రసిద్ధ శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ తదితర వైదిక కార్యక్రమాలను ఆగమశాస్త్ర విధానంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్రోత్సవాలు విజయవంతంగా జరగాలని ప్రార్థించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా జూలై 26న పవిత్ర ప్రతిష్ఠ, జూలై 27న గ్రంథి పవిత్ర సమర్పణ, జూలై 28న మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు. చివరి రోజు సాయంత్రం శ్రీ కపిలేశ్వరస్వామివారు, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ విఘ్నేశ్వరస్వామివారు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారు, శ్రీ చండికేశ్వరస్వామివార్ల పంచమూర్తులతో తిరువీధి ఉత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ అధికారులు కోరారు.

## 125 ఏళ్ల ఆలయానికి కొత్త ఊపు

**- భక్తి.. సేవే ధ్యేయంగా పాలకమండలి పనిచేయాలి**

**- సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి నారాయణ పిలుపు**



**నెల్లూరు(ప్రశ్న న్యూస్)** 125 సంవత్సరాల చారిత్రక వైభవాన్ని సొంతం చేసుకున్న నెల్లూరు సంతపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి నూతన పాలకమండలి అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ మహిమను మరింత విస్తరించేలా కృషి చేయాలని కోరారు. శనివారం జరిగిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి నారాయణ తన సతీమణి రమాదేవితో కలిసి హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతన చైర్మన్ ముప్పాళ్ల విజేతారెడ్డి, సభ్యులు శివప్రదీప్, జీత్‌సింగ్, చైతన్య, విజయ్‌కుమార్, లతేష్, శిల్పా, శిరీషాతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయ పాలకమండలిలో సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావించాలని అన్నారు. స్వామివారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనలో పాలకమండలి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, టీడీపీ నేతలు కిన్నెర ప్రసాద్, డీవీఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి మాతగా కనకదుర్గమ్మ

**- ఇంద్రకీలాద్రిపై శాకంబరీ శోభ**

**- 27 నుంచి 29 వరకు శాకంబరీ ఉత్సవాలు**




**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారు ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే శాకంబరీ ఉత్సవాల్లో ప్రకృతి మాత స్వరూపిణిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేలాది ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఉత్సవాల తొలి రోజు అలంకరణ కోసం శ్రీ దుర్గా మల్లేశ్వర హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు బడేటి ధర్మారావు ఆధ్వర్యంలో తొలి విడతగా 7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి సమర్పించారు. శనివారం సాయంత్రం మహామండపం ఆరో అంతస్తులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనా నాయక్ అమ్మవారికి కూరగాయలను సమర్పించారు. అనంతరం దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి అలంకరణ కోసం కూరగాయల దండల తయారీని ప్రారంభించారు. శాకంబరీ ఉత్సవాల కోసం అవసరమైన కూరగాయలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు ఈవో శీనా నాయక్ తెలిపారు. పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల తాడేపల్లిగూడెం, తణుకు, మడికి, సిద్ధాంతం, ఏలూరు ప్రాంతాలతో పాటు గుంటూరు జిల్లా జాగర్లమూడి, తెనాలి, యడ్లపల్లి, నారాకోడూరు, గుంటూరు, కృష్ణా జిల్లా నూజివీడు, చిన్న ఓగిరాల, పెద్ద ఓగిరాల ప్రాంతాల రైతుల నుంచి తాజా కూరగాయలను సేకరించి దేవస్థానం బస్సుల ద్వారా ఇంద్రకీలాద్రికి తరలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి, పంటల సమృద్ధికి ప్రతీకగా భావించే శాకంబరీ దేవి అలంకారం ప్రతి ఏడాది భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుందని, ఈసారి కూడా వేలాది మంది భక్తులు అమ్మవారి దివ్య దర్శనానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

## ఇంద్రకీలాద్రిపై రేపు విఐపీ దర్శనాలకు బ్రేక్

**- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రోటోకాల్ దర్శనాలు రద్దు**

**- భక్తుల రద్దీ దృష్ట్యా ఈవో వి.కె. శీనా నాయక్ నిర్ణయం**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై విఐపీ, ప్రోటోకాల్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వేలాదిగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు రానుండగా, వివిధ ప్రాంతాల నుంచి సారె సమర్పణకు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గత ఆదివారం సుమారు 85 వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో తీవ్ర రద్దీ నెలకొన్న నేపథ్యంలో, ఈసారి మరింత ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. దీంతో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విఐపీ, ప్రోటోకాల్ దర్శనాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఈవో స్పష్టం చేశారు. ఈ సమయంలో సాధారణ భక్తుల దర్శనానికే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఘాట్‌రోడ్డుపై ప్రైవేట్ వాహనాల రాకపోకలను నియంత్రించి, దేవస్థానం బస్సులను పూర్తి స్థాయిలో నడిపి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వృద్ధులు, వికలాంగులు, చంటి పిల్లల తల్లులు ఉదయం 8 గంటలలోపు లేదా సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య దర్శనానికి వస్తే రద్దీ తక్కువగా ఉండి సౌకర్యంగా అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని ఈవో సూచించారు. భక్తులందరూ దేవస్థానం అధికారులు, పోలీసులకు సహకరించి, క్రమశిక్షణతో వ్యవహరించాలని, రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సహనం పాటించాలని ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.

## ముత్తుకూరు గేట్‌కు సుందరీకరణ

**- ఆరణి కందప్ప సత్రంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం - ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**

**నెల్లూరు(ప్రశ్న న్యూస్)** నెల్లూరు నగరాన్ని ఆధునికంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నెల్లూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, ముత్తుకూరు గేట్ సెంటర్‌లోని సర్వేపల్లి కాలువ వద్దున ఉన్న స్థలాన్ని పరిశీలించి, ఆ ప్రాంతాన్ని బ్యూటిఫికేషన్ ద్వారా సుందరీకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వీఆర్‌సీ మైదానంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. తదుపరి సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో రూ.3.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం ఈఓ ఉషారాణి, పాలకమండలి చైర్మన్ మహేష్, కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకు ఐడీ కార్డులను అందజేసి మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సంతపేట వంటి రద్దీ ప్రాంతంలో ప్రతిరోజూ వేలాది మంది పాదచారులు, వ్యాపారులు, విద్యార్థులు, సెంట్ జోసెఫ్ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఉచితంగా శుద్ధి చేసిన తాగునీరు అందించే ఈ ఆర్వో ప్లాంట్ ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, టీడీపీ నేతలు పుట్టా అజయ్, ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# 'కాన్ సిటీ' మూవీ రివ్యూ!




తమిళంలో అర్జున్ దాస్ కి మంచి క్రేజ్ ఉంది. తెలుగులోను ఆయన నటనకి .. వాయిస్ కి ఫ్యాన్స్ ఉన్నారు. అలాంటి అర్జున్ దాస్ ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'కాన్ సిటీ'. హరీశ్ దురై రాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, అన్నా బెన్ .. యోగిబాబు .. వడివుక్కరసు కీలకమైన పాత్రలను పోషించారు. జూన్ 26వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 24వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు ఇతర భాషల్లోను అందుబాటులో ఉంది. శరవణన్ (అర్జున్ దాస్) ఓ ప్రభుత్వ ఉద్యోగి. శ్రీమంతుల కుటుంబానికి చెందిన ఐశ్వర్య (సాక్షి వైద్య) అతణ్ణి ప్రేమిస్తుంటుంది. వాళ్లిద్దరికీ వివాహం జరిపించాలనుకున్న ఆమె తండ్రి, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాడు. అందుకు కారణం శరవణన్ కి గల అప్పు. సొంత ఇంటికోసం తల్లి చేసిన అప్పు తీర్చడం కోసం, శరవణన్ అవినీతికి పాల్పడటం మొదలుపెడతాడు. ఈ విషయంలో అతనికి 'సదా' సహకరిస్తాడు. ఇద్దరూ కలిసి పెద్ద స్థాయి మోసాలకు శ్రీకారం చుడతారు. ఇక 'మిత్ర' (అన్నా బెన్) నమ్మినవాడి చేతిలో మోసపోతుంది. గర్భవతిగా ఉన్న ఆమె, ఎలాంటి కష్టం చేయలేని స్థితిలో ఉన్న ఆమె .. అవినీతి మార్గాన్ని ఎంచుకుంటుంది. ఇళ్లు లీజ్ కి ఇప్పిస్తానని చెప్పి మోసం చేయడం మొదలుపెడుతుంది. అదే ప్రాంతానికి చెందిన జానకి (వడి ఉక్కరసు),తన కొడుకు 'జాకీ'(యోగిబాబు)తో కలిసి 'ట్రస్ట్' పేరుతో డబ్బులు వసూలు చేస్తూ ఉంటుంది. తాము చేస్తున్నది అన్యాయమని కొడుకు చెబుతున్నా ఆమె వినిపించుకోదు. ఇలా ముగ్గురూ అవినీతి మార్గంలో సంపాదిస్తారు. తమ మోసాలు బయటపడే సమయానికి వేరే ప్రాంతానికి పారిపోయి అక్కడ తలదాచుకుంటారు. ఆ సమయంలోనే 'మిత్ర' కొడుకు కిడ్నాప్ కి గురవుతాడు. కిడ్నాపర్ ఎవరో కాదు ఒకప్పుడు పోలీస్ ఆఫీసర్ గా ఉన్న కల్యాణ సుందరం (నందగోపాల్) అని తెలుసుకుంటారు. ఈ ముగ్గురూ చేసిన మోసాలు ఎలా బయటపడతాయి? ఒక పోలీస్ ఆఫీసర్ కిడ్నాపర్ గా ఎందుకు మారతాడు? అవినీతి సొమ్మంతా ఏమైపోతుంది? అనేదే కథ. జీవితాన్ని ప్రభావితం చేసేవి అవసరాలు .. ఆపదలు.. అలవాట్లు. ఒక మనిషి దారితప్పడంలో ఇవే ప్రధానమైన పాత్రను పోషిస్తాయి. అవసరాలలో నుంచి .. ఆపదలలో నుంచి బయటపడాలంటే డబ్బు కావాలి. అలవాట్లు మానుకోలేని బలహీనతకు డబ్బుకి మించిన మందులేదు. అందువలన ఈజీ మని కోసం అలాంటివాళ్లు అక్రమ మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. అలాంటి వాళ్ల జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. అందంగా బ్రతకాలి .. అందరి కంటే గొప్పగా బ్రతకాలి అనే ఆశనే మనిషిని పెడత్రోవ పట్టిస్తుంది. మోసం చేసేవాడు డబ్బు పట్ల ఆశతోనే చేస్తాడు. మోసపోయేవాడు డబ్బు పట్ల ఆశతోనే మోసపోతాడు అనే సత్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నాన్ని దర్శకుడు చేసిన తీరు ఆలోచింపజేస్తుంది. పెద్దవాళ్లు తమ 'కల' .. తమ 'ఆశ' .. అంటూ పిల్లలను అప్పుల పాలు చేసి, వాళ్ల చెడు మార్గంలో వెళ్లడానికి కారకులు అవుతున్నారంటూ చెప్పిన విధానం బాగుంది. అప్పులు .. అవస్థలు .. ఈజీమని కోసం నేరం దిశగా అడుగులు ఫస్టాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వస్తాయి. ఆ నేరాలు చేసినందుకు బాధపడుతూ ఇక మారిపోవాలనుకున్న బ్యాచ్ కీ, గతంలో కంటే పెద్ద నేరం చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? అనే దిశగా సెకండాఫ్ కొనసాగుతుంది. దర్శకుడు అల్లుకున్న కథ .. వేసుకున్న స్క్రీన్ ప్లే .. ప్రధానమైన నాలుగు పాత్రలను మలిచిన విధానం ఈ సినిమాకి హైలైట్ గా చెప్పుకోవచ్చు. ఈ కంటెంట్ లో కథనే హీరో. పరిస్థితులను బట్టి పాత్రలు పరిగెడుతూ ఉంటాయి .. సందర్భాన్ని బట్టి ప్రవర్తిస్తూ ఉంటాయి. అర్జున్ దాస్ మార్క్ ను చూపించాడనికి గానీ .. యోగిబాబు మార్కును చూపించడానికి గాని దర్శకుడు ప్రయత్నించలేదు. పరిస్థితులకు తగినట్టుగానే ఆ పాత్రలు ప్రవర్తిస్తాయి. సన్నివేశాలు కూడా సహజత్వాన్ని దాటుకుని వెళ్లకపోవడం మనం గమనించవచ్చు. అందరూ తమ పాత్రలలో ఒదిగిపోయారు. ఎవరూ కూడా నటిస్తున్నట్టుగా ఉండదు. అరవింద్ విశ్వనాథన్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ నేపథ్య సంగీతం .. అరుళ్ మోసెస్ ఎడిటింగ్ పెర్ఫెక్ట్ గా అనిపిస్తాయి. డబ్బు పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోవచ్చు .. కానీ నమ్మకమనేది పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోలేము. కష్టపడి సంపాదించుకున్నది మాత్రమే నిలుస్తుంది. మోసంతో కూడబెట్టిన ధనం .. అలాగే చేజారిపోతుంది అనే సందేశం బలంగా ఇచ్చిన కంటెంట్ ఇది. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ కంటెంట్ గా చెప్పుకోవచ్చు. ఎక్కడా బోర్ అనిపించకుండా ఆసక్తికరంగా సాగిపోయే ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు.

# 40కోట్లతో విల్లా కొనుగోలు



దక్షిణాది లేడీ సూపర్‌స్టార్‌గా అభివర్ణించే నయనతార ప్రస్తుతం ఎనిమిది సినిమాలతో బిజీగా ఉంది. కథానాయికగా కెరీర్ మొదలుపెట్టి ఇరవై మూడేండ్లు గడుస్తున్నా ఆమెకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. ఒక్కో సినిమాకు 15కోట్ల వరకూ రెమ్యునరేషన్ అందుకుంటూ దక్షిణాదిలోనే అగ్రస్థానంలో కొనసాగుతున్నది. తాజాగా నయనతార చెన్నైలోని పోయెస్ గార్డెన్ ఏరియాలో 40కోట్ల ఖరీదైన విల్లాను కొనుగోలు చేసింది. రజనీకాంత్, ధనుష్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివసించే పోయెస్ గార్డెన్‌లో నయనతార ఇల్లు కొనుగోలు చేయడం చెన్నై సినీవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. త్వరలో కుటుంబంతో కలిసి నయనతార ఈ ఇంటిలోకి మారబోతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమె యశ్ 'టాక్సిక్'తో పాటు బాలీవుడ్‌లో సల్మాన్‌ఖాన్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నది. నయనతార తాజా చిత్రం 'హాయ్' ఆగస్ట్ 14న విడుదలకు సిద్ధమవుతున్నది.

# 'రామాయణ' సాంకేతికంగా ఓ సవాల్



దేశంలోనే అత్యంత భారీగా తెరకెక్కుతున్న చిత్రం.. పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. రణబీర్‌కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ అగ్ర నటుడు యశ్ రావణుడిగా, కాజల్ మండోదరిగా, సన్నీడియోల్ హనుమంతుడిగా ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకుడు. నమిత్ మల్హోత్రా రెండు భాగాలుగా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం ఈ ఏడాది దీపావళికి విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్-కాన్ 2026' వేడుకల్లో ఈ సినిమా బృందం సందడి చేసింది. ఇందులో భాగంగా ఇందులో రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్‌పై రావణపాత్రధారి యశ్ ప్రశంసలు కురిపించారు.'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. భావోద్వేగాలతో కూడుకున్న పాత్ర అది. రణబీర్ ఆ పాత్రను చాలా గొప్పగా పోషించాడు. ఈ సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంది. సంకల్పబలం ఉంటే తప్ప ఇలాంటి సినిమాలను నిర్మించలేం. ఈ సినిమా ప్రయాణంలో జీవితానికి కావాల్సిన ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. సాంకేతికంగా ఈ సినిమా ఓ సవాల్. మంచి టీమ్ కుదరడంతో అన్నీ కలిసొచ్చాయి. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని తెలిపారు యశ్. ఇదిలావుంటే ఈ నెల 24న విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ వాయిదా పడింది. ట్రైలర్‌ని కూడా అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని సంకల్పించామని, అందుకే వాయిదా వేశామని, త్వరలోనే ట్రైలర్‌ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు.

# మంచి పాత్రల కోసమే వేచి చూస్తున్నా..


## పెళ్లికి కూడా తొందరలేదు: నిధి అగర్వాల్



సినిమా అవకాశాల కోసం తాను ఎప్పుడూ తొందరపడనని... జీవితంలో సినిమాలైనా, పెళ్లయినా దేనికీ హడావుడి పడేది లేదని నటి నిధి అగర్వాల్ స్పష్టం చేసింది. మంచి కథలు, అర్థవంతమైన పాత్రల కోసమే తాను వేచి చూస్తున్నానని తెలిపింది. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' చిత్రాల తర్వాత తమిళంలో మళ్లీ నటించకపోవడానికి సరైన ప్రాజెక్ట్ రాకపోవడమే కారణమని చెప్పింది. నటనకు ప్రాధాన్యం ఉండే పాత్రలు చేయడానికి తమిళ చిత్రసీమ సరైన వేదిక అని వ్యాఖ్యానించింది. పవన్ కల్యాణ్‌తో 'హరి హర వీరమల్లు', ప్రభాస్‌తో 'ది రాజా సాబ్' వంటి భారీ చిత్రాల్లో నటించడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు నిధి తెలిపింది. ప్రస్తుతం తెలుగు, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్లే తమిళ సినిమాలకు కాస్త దూరమయ్యానని పేర్కొంది. వృత్తిపరంగా తాను ఎంతో కష్టపడతానని, అయితే మిగతా విషయాల్లో చాలా సోమరినని సరదాగా వ్యాఖ్యానించింది. అలాగే తనది చాలా సున్నితమైన మనస్తత్వమని, అందుకే భావోద్వేగాలను బయటకు చూపించనని తెలిపింది. ప్రస్తుతం మరో రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వాటి వివరాలు వెల్లడిస్తానని నిధి చెప్పింది. ఇకపోతే ఆమె త్వరలోనే 'మిరాయ్' పార్ట్-2 తో పాటు హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్' చిత్రాల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రణబాలి కోసం కఠోర సాధన

అగ్ర హీరో విజయ్ దేవరకొండ 'రణబాలి' చిత్రం సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. సతీమణి రష్మిక మందన్నతో కలిసి ఆయన నటించిన ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వివాహానంతరం రాబోతున్న తొలి సినిమా అదే కావడం మరింత హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. ఈ పీరియాడిక్ డ్రామా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీ, యుద్ధవిద్యల్లో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేకంగా నిలుస్తుందని చెబుతున్నారు. గుర్రపుస్వారీ, కత్తిసాముతో పాటు గన్ షూటింగ్‌లో (ఫైర్‌ఆర్మ్ ఆపరేషన్) ఇంటెన్స్ ట్రెయినింగ్ తీసుకున్నాడట. గుర్రపుస్వారీ చేస్తూనే బందూక్‌ను పేల్చే యాక్షన్ ఘట్టాలపై ఆయన ప్రత్యేక తర్ఫీదును తీసుకున్నాడని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. పోరాట ఘట్టాలు అత్యంత సహజంగా కనిపించేందుకు శారీరకంగా కఠోర సాధన చేశారని, హెవీ బాడీబిల్డింగ్‌తో ఆయన లుక్స్ ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయని చెబుతున్నారు. రణబాలి పాత్ర తాలూకు శారీరక, మానసిక ఉద్వేగాల్ని ప్రతిబింబించేలా యుద్ధ వీరుడిగా ఆయన పాత్ర ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటుందని అంటున్నారు. 1854-1878 మధ్య బ్రిటీష్ కాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజయ్-అతుల్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్, కథ, దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.





పూర్తిస్థాయిలో దక్షిణాది సినిమాలపై దృష్టిపెట్టేందుకు ఇటీవలే ముంబయి నుంచి చెన్నైకి షిఫ్ట్ అయింది అగ్ర కథానాయిక శృతిహాసన్. డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారికాతో నాలుగేళ్ల ప్రేమాయణానికి బ్రేకప్ చెప్పిన ఈ భామ ఇప్పుడు సినిమాలే తన ప్రపంచమని చెబుతున్నది.

తాజాగా సోషల్‌మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఈ సొగసరి వారు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలిచ్చింది. పెళ్లెప్పుడంటూ పలువురు అభిమానులు అడిగిన ప్రశ్నలకు 'ఆ ఒక్కటి తప్ప మరేదైనా అడగండి. జవాబు ఇవ్వడానికి సిద్ధం' అంటూ ఫన్నీగా రిప్లై ఇచ్చింది. పదే పదే అదే ప్రశ్న అడగటం ఆపాలని కోరింది. ప్రస్తుతం తన దృష్టి మొత్తం సినిమాల మీదే ఉందని, నటిగా ఇదో కొత్త దశ అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం శృతిహాసన్ తెలుగులో దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటిస్తున్నది. పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది.

# నిరాశ్రయ మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వసతి కల్పించాలి

- అర్బన్ హోమ్‌లెస్ షెల్టర్‌ను పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్
- ఉప్పల్ మార్కెట్‌లోని మహిళల నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- పరిశుభ్రత, వసతులు, నిర్వహణ తీరుపై సమగ్ర పరిశీలన
- లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశం
- మహిళల భద్రత, పరిశుభ్రత, గౌరవప్రదమైన జీవన వాతావరణానికి అత్యంత ప్రాధాన్యం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, అదనపు కమిషనర్ తో కలిసి ఉప్పల్ జోన్, సర్కిల్--9 పరిధిలోని ఉప్పల్ మార్కెట్‌లో ఉన్న మహిళల పట్టణ నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం ను సందర్శించి అక్కడి నిర్వహణ, వసతులను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆశ్రయ కేంద్రంలో నివసిస్తున్న మహిళలకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రాంగణ నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను కమిషనర్ పరిశీలించారు. కేంద్రాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నివాసితులకు అవసరమైన అన్ని కనీస సదుపాయాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మహిళల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, గౌరవానికి ఎలాంటి లోటు లేకుండా ఆశ్రయ కేంద్రాన్ని నిర్వహించాలని, నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఆశ్రయం పొందుతున్న ప్రతి మహిళకు సురక్షితమైన, పరిశుభ్రమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం కార్పొరేషన్ బాధ్యత అని కమిషనర్ స్పష్టం చేశారు.ఆశ్రయ కేంద్రాల నిర్వహణలో కేవలం వసతి కల్పించడమే కాకుండా, లబ్ధిదారుల సంక్షేమం, భద్రత, జీవన ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

# ఏపీలో మరో 10 కరోనా కేసులు

- మొత్తం కేసులు 49కు చేరిక.. 24 మంది ఆసుపత్రుల్లో చికిత్స
- గుంటూరులో ముగ్గురు.. ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరికి పాజిటివ్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో శనివారం మరో 10 కొత్త కోవిడ్–19 కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 49కు చేరింది. కొత్త కేసుల్లో గుంటూరు జిల్లాలో ముగ్గురు, ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్కరికి కరోనా నిర్ధారణ అయింది. వైద్యారోగ్య శాఖ శనివారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 302 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. నమోదైన మొత్తం కేసుల్లో తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 11 కేసులు ఉండగా, గుంటూరు జిల్లాలో 9, వైఎస్సార్ కడప జిల్లాలో 8, విశాఖపట్నంలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 3 కేసులు నమోదయ్యాయి. కాకినాడ, ఏలూరు, బాపట్ల జిల్లాల్లో రెండేసి కేసులు నమోదవగా, ఇతర జిల్లాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి.ప్రస్తుతం రాష్ట్రంలో 24 మంది కరోనా బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరో 16 మంది వైద్యుల పర్యవేక్షణలో ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు ఐదుగురు పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయ్యారు. వీరిలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ముగ్గురు, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో నలుగురు మృతి చెందగా, వారిలో ముగ్గురు వైఎస్సార్ కడప జిల్లాకు, ఒకరు కాకినాడ జిల్లాకు చెందినవారు. కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యాధి నిఘాను మరింత పటిష్ఠం చేసినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. కరోనా పాజిటివ్‌గా తేలిన వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, వారి సన్నిహితులను గుర్తించి పరీక్షలు నిర్వహించే ప్రక్రియను జిల్లా సత్వర స్పందన బృందాలు చేపట్టాయి.అనుమానితులకు వెంటనే పరీక్షలు నిర్వహించేందుకు ఆర్‌టీపీసీఆర్ కిట్లను అన్ని నిర్దేశిత ప్రయోగశాలల్లో అందుబాటులో ఉంచారు. ద్వితీయ, తృతీయ స్థాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక కరోనా పడకలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన మందులు, రక్షణ పరికరాలు, పరీక్ష కిట్లు, ఇతర వైద్య సామగ్రిని కూడా సమకూర్చినట్లు అధికారులు వెల్లడించారు. జూలై 10 నుంచే అన్ని జిల్లాలను అప్రమత్తం చేసిన వైద్యారోగ్య శాఖ, జూలై 18న జిల్లా వ్యాధి నిఘా బృందాలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి కేసుల గుర్తింపు, పరీక్షలు, బాధితుల పర్యవేక్షణ, ఆసుపత్రుల్లో చికిత్స ఏర్పాట్లపై నిరంతర అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించింది. ప్రజలు జ్వరం, దగ్గు, శ్వాస సంబంధిత లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యారోగ్య శాఖ సూచించింది.

# పేదల రేషన్ బియ్యం అక్రమ దందా..

## గజ్వేల్‌లో అక్రమ వ్యాపారిపై పీడీ యాక్ట్

- ఆరు కేసులతో నేరచరిత్ర చెర్లపల్లి జైలుకు తరలింపు
- అక్రమ రవాణాదారులకు సిపి రష్మీ పెరుమాళ్ కఠిన హెచ్చరిక



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ చేసి, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్న ప్రధాన అక్రమ వ్యాపారిపై సిద్దిపేట పోలీసులు ఉక్కుపాదం మోపారు. బచ్చు రత్నాకర్ (46) అనే నిందితుడిపై పీడీ (ప్రివెంటివ్ డెటెన్షన్ ) యాక్ట్ నమోదు చేసి, శనివారం చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.పోలీసుల దర్యాప్తులో నిందితుడు తెలంగాణ రాష్ట్ర పీడీఎస్ నియంత్రణ ఉత్తర్వులు--2016 మరియు అవసర వస్తువుల చట్టం--1955 నిబంధనలను ఉల్లంఘిస్తూ రేషన్ కార్డుదారులు, రేషన్ డీలర్ల నుంచి తక్కువ ధరలకు బియ్యాన్ని కొనుగోలు చేసి, రాయిపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని వీరభద్ర రైస్ మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచి, రీసైక్లింగ్ చేసి, అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పేదలకు అందాల్సిన ఆహార భద్రతకు తీవ్ర విఘాతం కలిగిందని పోలీసులు తెలిపారు.నిందితుడిపై 2024లో రెండు కేసులు, 2026లో నాలుగు కేసులు నమోదై ఉండటంతో అతని నేరచరిత్రను సమగ్రంగా పరిశీలించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ పీడీ యాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.అక్రమ రవాణాదారులకు సిపి స్ట్రాంగ్ వార్నింగ్"పేదల నోటి ముద్దను దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. ప్రజా పంపిణీ వ్యవస్థకు విఘాతం కలిగించే అక్రమ రవాణాదారులపై భవిష్యత్తులో కూడా పీడీ యాక్ట్ సహా అత్యంత కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయి" అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు.

# భక్తికి గౌరవం.. పర్యావరణానికి బాధ్యత

- ఉప్పల్‌లో 'ప్రాజెక్ట్ ఉద్వాసన'ను ప్రారంభించిన ఎంఎంసీ కమిషనర్
- ఉప్పల్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 'ప్రాజెక్ట్ ఉద్వాసన'కు శ్రీకారం
- ఎంఎంసీ పరిధిలోని మూడు జోన్లలో ఒక్కో ఆలయం ఎంపిక
- పాత దేవతామూర్తులు, చిత్రపటాలు, ఫ్రేమ్‌లు, ఇతర పవిత్ర వస్తువులకు సంప్రదాయబద్ధంగా ఉద్వాసన
- పవిత్ర వస్తువులను పర్యావరణహిత రీసైక్లింగ్‌కు తరలించే వినూత్న కార్యక్రమం
- భక్తి, సంప్రదాయం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణల సమన్వయమే లక్ష్యం







**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక విశ్వాసాలకు గౌరవం కల్పిస్తూనే పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన 'ప్రాజెక్ట్ ఉద్వాసన -- డివైన్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, ఉప్పల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధమైన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కమిషనర్.ప్రజల నుంచి సేకరించిన పాత, వినియోగంలో లేని దేవతామూర్తులు, దేవుళ్ల--దేవతల చిత్రపటాలు, ఫ్రేమ్‌లు, ఇతర పవిత్ర వస్తువులకు గౌరవప్రదంగా ఉద్వాసన పలికే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ప్రాజెక్ట్ ఉద్వాసన' అమలులో భాగంగా ఎంఎంసీ పరిధిలోని ఉప్పల్, మల్కాజ్‌గిరి, ఎల్‌బీ నగర్ జోన్లలో ఒక్కో ఆలయాన్ని ప్రత్యేక కేంద్రంగా ఎంపిక చేశారు. ఉప్పల్ జోన్‌లో జోనల్ కమిషనర్ శ్రీమతి రాధికా గుప్తా, ఐఏఎస్ ఉప్పల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, మల్కాజ్‌గిరి జోన్‌లో జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్ మల్కాజ్‌గిరి ప్రాంతంలోని ముదుగుళ్ల ఆలయంలో, ఎల్‌బీ నగర్ జోన్‌లో జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో , అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ 3 జోన్ లో జరిగిన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ప్రజల నుంచి సేకరించిన పాత, వినియోగంలో లేని పవిత్ర వస్తువులను చెరువులు, నాలాలు, రహదారులు లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా, వాటి పవిత్రతకు భంగం కలగని విధంగా సంప్రదాయబద్ధంగా ఉద్వాసన నిర్వహించిన అనంతరం బాధ్యతాయుతమైన, పర్యావరణహిత రీసైక్లింగ్ ప్రక్రియకు తరలించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక విశ్వాసాలకు గౌరవం ఇస్తూనే పవిత్ర వస్తువులను శాస్త్రీయంగా, పర్యావరణహితంగా నిర్వహించడమే 'ప్రాజెక్ట్ ఉద్వాసన' ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. భక్తి--సంప్రదాయం--పరిశుభ్రత--పర్యావరణ బాధ్యతలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే వినూత్న కార్యక్రమంగా దీనిని తీర్చిదిద్దాలని సూచించారు.పాత పవిత్ర వస్తువులను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా కార్పొరేషన్ నిర్దేశించిన కేంద్రాలకు అప్పగించి, నగర పరిశుభ్రత, జలవనరుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

# అక్రమ షెడ్డు నిర్మాణంపై కొరడా

- నోటీసు ఇచ్చిన ఆగని నిర్మాణ పనులు - ఆగ్రహించిన టౌన్ ప్లానింగ్ అధికారులు - నిర్మాణ సామాగ్రిని సీజ్ చేసిన అధికారులు





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ఎల్లంపేట మున్సిపల్ పరిధి రాజ బొల్లారంలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు పై మున్సిపల్ అధికారులు కొరడా విధించారు. అక్రమంగా నిర్మిస్తున్న ఈ షెడ్డు కు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చిన నిర్మాణ పనులను ఆపకపోవడంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ చంద్రకాంత్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణ పనులను నిలుపుదల చేసి నిర్మాణ పనులకు సంబంధించిన సామాగ్రిని సీజ్ చేశారు.

**వివరాలు ఇలా ఉన్నాయి**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రాజ బొల్లారం వార్డ్ కార్యాలయం సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్డును నిర్మిస్తున్నారు. ఈ విషయం ఎల్లంపేట మున్సిపల్ అధికారుల దృష్టికి వెళ్లడంతో పనులను నిలుపుదల చేయాలంటూ నోటీసును సైతం అందజేశారు. అయినా పనులు కొనసాగుతున్నడంతో ఈ విషయం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ చంద్రకాంత్ దృష్టికి వెళ్లడంతో వారు చేపడుతున్న నిర్మాణ పనులను నిలుపుదల చేయించి, నిర్మాణ పనులకు సంబంధించిన సామాగ్రిని సీజ్ చేశారు .

ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ చంద్రకాంత్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బీసీలను మోసం చేసి.. ఇప్పుడు బీసీ గర్జనా?

- జగన్‌పై ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు
- బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం



**మంగళగిరి (ప్రశ్న న్యూస్)**ఐదేళ్ల పాలనలో బీసీలను మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు "బీసీ గర్జన" పేరుతో సభలు నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మంత్రి మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ప్రశ్నించినందుకే పలువురు బీసీ నేతలపై దాడులు, హత్యలు జరిగాయని ఆరోపించారు. బీసీలపై జరిగిన ఘటనల్లో ఒక్క బాధిత కుటుంబాన్ని కూడా జగన్ పరామర్శించలేదని విమర్శించారు. బీసీల సంక్షేమానికి సంబంధించిన రూ.75 వేల కోట్ల నిధులను దారి మళ్లించారని, 34 సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఆరోపించారు.స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి వేలాది మంది బీసీల రాజకీయ అవకాశాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. గురుకులాలు, బీసీ హాస్టళ్లు, చేనేత కార్మికులు, మత్స్యకారుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు.వైసీపీ నాయకులు జోగి రమేష్, విడుదల రజని, చెల్లుబోయిన వేణుగోపాల్, సీదిరి అప్పలరాజు తదితరులపై కూడా మంత్రి విమర్శలు గుప్పించారు. బీసీలపై జరిగిన ఘటనల సమయంలో వారు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీలను సమాజానికి వెన్నెముకగా గుర్తించి వారి అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. రెండేళ్లలోనే బీసీ సంక్షేమానికి రూ.50,001 కోట్లు కేటాయించి ఖర్చు చేశామని, రానున్న ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లతో సమగ్ర కార్యాచరణ అమలు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను తిరిగి 34 శాతానికి తీసుకురావడానికి చర్యలు చేపట్టామని, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల విస్తరణతో పాటు 5 వేల మంది విద్యార్థులకు అదనపు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం, వడ్డెర్లకు క్వారీల కేటాయింపులో 33 శాతం రిజర్వేషన్లు, చేనేత కార్మికులకు చేయూత పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం, మగ్గాలకు ఉచిత విద్యుత్, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల సాయం, స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు.బీసీ గర్జన పేరుతో రాజకీయ కుట్రలు చేయాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించిన మంత్రి, బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి

## బోనాల మహోత్సవానికి ఆహ్వానం

- మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్
- గజ్వేల్ మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలకు ఆహ్వాన పత్రిక అందజేత
- పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా గజ్వేల్ పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)ను గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి బోనాల ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణ అభివృద్ధి, మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణపై కేసీఆర్‌తో విస్తృతంగా చర్చించారు. పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కేసీఆర్ విలువైన సూచనలు, సలహాలు అందించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు."గజ్వేల్‌లో బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, అత్యంత వైభవంగా నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షిస్తున్నాం. ఈ మహోత్సవ విజయానికి ప్రజలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని" చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మసకబారిన ఎల్ఈడీలు

## –చీకట్లో మునిగిన గ్రేటర్

- స్ట్రీట్‌లైట్ల నిర్వహణలో జీహెచ్ఎంసీ ఘోర వైఫల్యం
- కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా వెలగని వీధి దీపాలు
- నగరాన్ని గ్రామాల కంటే అధ్వాన్నంగా మార్చిన అధికారుల నిర్లక్ష్యం


తార్నాక రహదారిపై మసకబారిన స్ట్రీట్ లైట్లు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు గొప్పలు చెబుతున్నా నగర రహదారులపై అడుగుపెడితే మాత్రం అసలు వాస్తవం కళ్లకు కడుతుంది. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి దీపాలు నేడు మసకబారిపోయి చీకట్లకు స్వాగతం పలుకుతున్నాయి. అనేక ప్రధాన రహదారులు, కాలనీలు, కూడళ్లు రాత్రి వేళల్లో వెలుతురు లేక అంధకారంలో మునిగిపోతున్నా అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజల ప్రాణాల కంటే ఫైళ్లకే ప్రాధాన్యం ఇస్తున్న జీహెచ్ఎంసీ యంత్రాంగం, స్ట్రీట్‌లైట్ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసిందని స్థానికులు మండిపడుతున్నారు. ఒక లైట్ చెడిపోయినా వారాల తరబడి, నెలల తరబడి దానిని మార్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రజలు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని ఆగ్రహం వ్యక్తమవుతోంది.రాత్రి వేళల్లో వెలుతురు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి పరిస్థితి నెలకొన్నది. ద్విచక్ర వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని గొలుసు లాక్కోవడం, దొంగతనాలు వంటి ఘటనలు జరిగే అవకాశాలు పెరుగుతాయని తెలిసి కూడా జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం సమస్యను చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రతి ఏడాది స్ట్రీట్‌లైట్ నిర్వహణకు ప్రభుత్వం భారీ నిధులు కేటాయిస్తున్నప్పటికీ, నగరంలో కనిపిస్తున్న దుస్థితి ప్రజల్లో అనేక ప్రశ్నలకు తావిస్తోంది.

### నిర్వహణ వ్యవస్థ ఎందుకు విఫలమైంది..

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మసకబారిన లైట్లు ఎందుకు వెంటనే మార్చడం లేదు.? నిర్వహణ పనులపై పర్యవేక్షణ ఎక్కడ.? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి ఉంటే నేడు నగరం చీకట్లో మగ్గే పరిస్థితి వచ్చేదే కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కార్యాలయాల్లో సమావేశాలు, సమీక్షలతో సరిపెట్టకుండా రాత్రి వేళల్లో నగరాన్ని స్వయంగా పరిశీలిస్తే అసలు పరిస్థితి అర్థమవుతుందని ప్రజలు సూచిస్తున్నారు.స్మార్ట్ సిటీ, అభివృద్ధి, ఆధునిక మౌలిక సదుపాయాల పేరుతో ప్రచారం చేసుకోవడం కంటే, ప్రజలకు కనీస అవసరమైన వీధి దీపాల వెలుతురును కల్పించడం జీహెచ్ ఎంసీ మొదటి బాధ్యత. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో అధికారులు విఫలమైతే ప్రజల్లో విశ్వాసం దెబ్బతినడం సహజమే. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు నగరవ్యాప్తంగా ప్రత్యేక సర్వే నిర్వహించి, మసకబారిన ఎల్ఈడీ లైట్లను వెంటనే మార్చాలి. పనిచేయని స్ట్రీట్‌లైట్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని, నగర ప్రజలకు సురక్షితమైన రహదారులు, తగిన వెలుతురు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే గ్రేటర్ హైదరాబాద్ అనే పేరు మాత్రమే మిగిలి, నగరం మొత్తం చీకట్లకు చిరునామాగా మారే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# మేడ్చల్‌లో అక్రమ కట్టడాల తొలగింపు

- ఏసిపి భాస్కర్ గౌడ్ పర్యవేక్షణలో అక్రమ కట్టడాల తొలగింపు
- స్టేషన్ రోడ్డుకు విముక్తి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డు కు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలను, అక్రమ కట్టడాలను కూల్చివేశారు ఏసిపి భాస్కర్ గౌడ్ పర్యవేక్షణలో అక్రమ కట్టడాలు కూల్చివేశారు. జెసిబి సహాయంతో రోడ్డు ను ఆక్రమించుకొని వెలిసిన అక్రమ డబ్బాలు, షాపులకు ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించారు. దీంతో రోడ్లన్నీ విశాలంగా అయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా టీ డబ్బాలు, షాపుల ముందు షెడ్లను వేసుకోవడం వల్ల రోడ్లు ఇరుకుగా మారాయి. రోడ్లను ఆక్రమించుకొని వేసుకున్న డబ్బాలను తొలగించడంతో పాటు షాపులకు వేసుకున్న షెడ్లను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ భాస్కర్ గౌడ్ తో పాటు టీపీఎస్ సాయి తేజ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రాజేష్, అఫ్రోజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనమే సుస్థిర భవిష్యత్తుకు పునాది

- ఫతుల్లగూడ యానిమల్ కేర్ సెంటర్‌లో వనమహోత్సవం
- వనమహోత్సవంలో భాగంగా 200 మొక్కలు నాటిన ఎంఎంసీ అధికారులు
- పట్టణ హరిత విస్తీర్ణం పెంపు, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం
- నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వృక్షంగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని సూచన
- పరిశుభ్రమైన, పచ్చని, సుస్థిర మల్కాజ్‌గిరి నిర్మాణమే లక్ష్యం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫతుల్లగూడలోని యానిమల్ కేర్ సెంటర్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్, అదనపు కమిషనర్ అర్బన్ బయోడైవర్సిటీ డైరెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. వనమహోత్సవంలో భాగంగా యానిమల్ కేర్ సెంటర్ ప్రాంగణంలో మొత్తం 200 మొక్కలను నాటి, పట్టణ పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను నిరంతరం సంరక్షించి వృక్షంగా ఎదిగేలా చూడటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, ప్రజా ప్రదేశాలు, సంస్థల ప్రాంగణాలు తదితర ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటి హరిత విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.వాతావరణ సమతుల్యత, కాలుష్య నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణలో పచ్చదనం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా మొక్కల పెంపకం, సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన, పచ్చని, పర్యావరణహిత మరియు సుస్థిర మల్కాజ్‌గిరి నిర్మాణమే లక్ష్యంగా వనమహోత్సవ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని అధికారులకు సూచించారు

# బడి బస్సులు సురక్షితమేనా.?

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన సెయింట్ క్లారేట్ ప్రైవేటు పాఠశాల స్కూల్ బస్సు
- తప్పిన పెను ప్రమాదం..ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ప్రైవేట్ పాఠశాలల బస్సులలో విద్యార్థుల భద్రత సురక్షితమైన అనే అనుమానాలు కలుగుతున్నాయి. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్నెస్ పై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ పట్టణం అత్వెల్లి లో జాతీయ రహదారి 44 పై ఆగి ఉన్న లారీని సెయింట్ క్లారిట్ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు




విద్యార్థులు ఉండడం... వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. విద్యార్థుల ను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో బండ మాదారం వద్ద ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి పొలాలకు దూసుకెళ్లింది. ఈ ఘటనల్లోనూ విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనను మరువకముందే అదే పాఠశాల చెందిన అదే బస్సు సేమ్ ప్రమాదానికి గురైంది. అప్పుడు సైతం విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఇలా ప్రైవేట్ పాఠశాలల బస్సులు నిరంతరం ప్రమాదాలకు గురవుతున్న సంబంధిత ఆర్టీఏ అధికారులు ఏం చేస్తున్నారు అంటూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### డ్రైవర్ల నిర్లక్ష్యం, ఫిట్నెస్ లేని బస్సులు

డ్రైవర్ల నిర్లక్ష్యం ఫిట్నెస్ లేని బస్సుల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తుంది. ఫిట్నెస్ ఉంటేనే బస్సు రోడ్డుఎక్కాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏటా మే 15 నుంచి జూన్ 12 వరకు రవాణా శాఖ అధికారుల వద్ద ప్రైవేట్ యాజమాన్యాలు వాహన సామర్థ్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కొన్ని బస్సులకు మాత్రమే ఫిట్నెస్ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఫిట్నెస్ చేయించుకొని బస్సులు రోడ్డుమీదికి వస్తే బస్సులను సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్న పలు పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి అనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల బస్సుల్లో పని చేస్తే డ్రైవర్లకు రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్య చికిత్స చేయించి మెడికల్ సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచాలి. కానీ ఈ విషయంపై యాజమాన్యాలు దృష్టి సారించడం లేదని సమాచారం. డ్రైవర్ పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు యాజమాన్యాలు ధ్రువీకరించాల్సిన అవసరం ఉంటుంది. అలాగే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఐదు సంవత్సరాలు అనుభవం ఉన్న వారినే డ్రైవర్ లేక నియమించుకోవాలని నిబంధన కూడా ఉంది. లైట్లు హ్యాండ్ బ్రేక్, ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ లు కలిగి ఉండాలి. కానీ జిల్లాలో పలు పాఠశాలలు ఇవి ఏవి పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం వారికి అనుభవం లేని డ్రైవర్లను నియమించుకోవడం వల్ల స్కూల్ బస్సులు ప్రమాదాల గురవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని తెలుస్తోంది. వేల వేల రూపాయలు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సు భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### గ్రిల్స్ తప్పనిసరి

బస్సులో ప్రయాణించే విద్యార్థుల భద్రత కోసం బతుకు మూడు వైపుల తప్ప గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిబంధన ఉంది. కానీ జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు వీటిని మర్చిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలలో బస్సులో ప్రయాణించేది చిన్న పిల్లలు కావడంతో బస్సు కదిలేటప్పుడు కిటికీల నుంచి చేతులు బయటకు పెట్టకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. గ్రిల్స్ లేని పక్షంలో ప్రయాణ సమయంలో విద్యార్థులు చేతులు బయటపెట్టే అవకాశం ఉన్నందున నిపుణులు పేర్కొంటున్నారు.

### ప్రధమ చికిత్స డబ్బాలో కానీ రాని పరికరాలు

విద్యాసంస్థల బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో ప్రథమ చికిత్స కు సంబంధించి ఎలాంటి పరికరాలు ఉండడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లో తప్పనిసరిగా కాటన్ అయోడిన్ స్పిరిట్ బాటిల్ బ్యాండేజ్ ఉండాలని నిబంధన ఉంది. బస్సుల్లో తదితర వస్తువులు ఉన్నప్పటికీ అవి కాలం చెల్లి ఉండడం విశేషం. చిన్నచిన్న ప్రమాద జరిగినప్పుడు విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉపయోగపడతాయి. వీటితో పాటు విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. డ్రైవర్లకు సంబంధించిన పూర్తి వివరాలు ఫోటో పేరు సెల్ నెంబర్ విధిగా ప్రదర్శించాలని నిబంధన ఉంది. కానీ జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఇవేవీ పాటించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

# విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను

- రాజీనామాపై స్పందించిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో విద్యా వ్యవస్థను తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు ఈ పరిణామం ఒక పెద్ద అడుగు అని అభివర్ణించారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని విడుదల చేశారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకొన్నప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన హింసకు, లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే రెండు ముఖ్యమైన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. బాధ్యులైన ప్రతీ ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని ఉద్ఘాటించారు. ఈ ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన రైతులు, కూలీలు, పేదలు, ఇతర వర్గాల ప్రజలందరూ తమ ఆత్మగౌరవం కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని రాహుల్ పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే అసలైన నిరసన బలం ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, "ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నారు.

# ఇది ప్రజాస్వామ్య విజయం

## – ప్రధాన్ రాజీనామాపై సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా 'ప్రజాస్వామ్య విజయం'గా సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు. వీధుల నుంచి పోరాడి సాధించుకున్న ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ఇది నిదర్శనమని చెప్పారు. శనివారం ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించిన వెంటనే వాంగ్‌చుక్ 'ఎక్స్' వేదికగా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. శాంతి, ఓపిక, పట్టుదలకు దక్కిన ప్రతిఫలమిదని వాంగ్‌చుక్ ఆనందం వ్యక్తం చేశారు. "దేశంలోని ప్రతీ మూల నుంచి భయాన్ని వీడి, గళమెత్తిన పౌరులకు, జెన్–జీ యువతకు, సీజేపీకి నా అభినందనలు. బాధ్యతాయుత పాలన డిమాండ్ నుంచి మొదలైన ఈ పోరాటం, ఇప్పుడు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణల దిశగా అడుగులు వేయాలి" అని పేర్కొన్నారు. పరీక్షల అక్రమాలు, ప్రశ్న పత్రాల లీక్‌లపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ వాంగ్‌చుక్ 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588